




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 297 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 3 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 297 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 3 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# ఏడాది కాలంగా ఇదే మా పాలసీ

- కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన
- దేశంలోనే కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని స్పష్టీకరణ
- ఈ ఏడాదిలోనే కుప్పం చివరి ఆయకట్టుకు హంద్రీనీవా జలాలు
- స్వర్ణ కుప్పం ప్రాజెక్టు కింద రూ. 1292 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం
- అభివృద్ధి ద్వారా వచ్చిన ఆదాయంతోనే సంక్షేమం అమలు చేస్తామన్న చంద్రబాబు
- విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నామని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**తన నియోజకవర్గమైన కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. బుధవారం నాడు కుప్పంలో పర్యటించిన ఆయన, 'స్వర్ణ కుప్పం' ప్రాజెక్టులో భాగంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో మాట్లాడుతూ, విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నామని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమై న హంద్రీనీవా నీళ్లను ఈ ఏడాదిలోనే అందిస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. రూ. 3,890 కోట్ల వ్యయంతో హంద్రీనీవా పనులను పూర్తి చేసి, నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు పారిస్తామని తెలిపారు. "అభివృద్ధి చేసే వారికే సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ఉంటుంది. అప్పులు తెచ్చి సంక్షేమం చేస్తామనడం సరైన పరిపాలన కాదు," అని ఆయన అన్నారు. అభివృద్ధి ద్వారా ఆదాయాన్ని వివరాలు 2లో..

## బానిసగాబతకడం కన్నా జైలులోని చీకటి గదే మేలు



- పాక్ పాలకులపై మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీవ్రస్థాయిలో ధ్వజం
- బానిసత్వం కంటే జైల్లో ఉండటానికే ఇష్టపడతానని వ్యాఖ్య
- జులై 6 నుంచి నిరసనలు చేపట్టాలని మద్దతుదారులకు పిలుపు
- 26వ రాజ్యాంగ సవరణ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిందని ఆరోపణ వివరాలు 2లో..
- ఆర్మీ చీఫ్, న్యాయవ్యవస్థ పైనా తీవ్ర విమర్శలు చేసిన ఇమ్రాన్

## ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి.. రైతులకు అండగా నిలుస్తాం

- లక్ష వ్యవసాయ కుంటలను రైతులకు అందుబాటులోకి తెచ్చామన్న పవన్
- రైతుల సహకారంతోనే ఇది సాధ్యమయిందని ప్రశంస
- కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఫామ్ పాండ్స్ (వ్యవసాయ కుంటలు) నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. వివరాలు 2లో..

## చంద్రబాబును కాపాడాలి.. కేసీఆర్ ను తిట్టాలి.. ఇదే రేవంత్ రెడ్డి పని

- కేసీఆర్ ను తిట్టడమే రేవంత్ లక్ష్యమన్న గంగుల
- బనకచర్లపై పాత పాటే పాడారని ఎద్దేవా
- కేసీఆర్ గోదావరి జలాలు వాడుకోమని చెప్పడం బనకచర్లకు అనుమతి ఇచ్చినట్టు ఎలా అవుతుందని ప్రశ్న



**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ఇచ్చిన పవర్ పా యింట్ ప్రజెంటేషన్ (పీపీపీ) ఒక ప్రహసనమని, అందులో కొత్తదనం ఏమీ లేదని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. కేవలం వివరాలు 2లో..

## జగన్ పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన బైరెడ్డి శబరి



- చిల్లర రాజకీయాలతో పాదయాత్ర చేస్తే జనం చెప్పులతో కొడతారన్న శబరి వివరాలు 2లో..
- వైసీపీ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తోందని తీవ్ర ఆరోపణలు
- కదిరిలో సీబీఐ దాడులపై వైసీపీ సమాధానం చెప్పాలన్న ఎమ్మెల్యే కందికుంట

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష

- కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ తీర్పు
- గతేడాది దేశం విడిచి వెళ్లిన తర్వాత హసీనాకు ఇదే తొలి శిక్ష
- మానవ హననం కేసులోనూ తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న హసీనా



**పెన్ పవర్ డెస్క్:**బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కేసులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆమెను దోషిగా తేల్చిన బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసీటీ), బుధవారం ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. దాదాపు ఏడాది క్రితం దేశంలో తీవ్ర నిరసనల మధ్య ఆమె ప్రభుత్వం కూలిపోయి, దేశం విడిచి వెళ్లిన తర్వాత ఒక కేసులో ఆమెకు శిక్ష పడటం ఇదే మొదటిసారి.ఢాకా ట్రిబ్యూన్ పత్రిక కథనం ప్రకారం, జస్టిస్ ఎండీ గోలాం మొర్తజా మొజుందర్ వివరాలు 2లో..

## హిమాచల్‌లో జల విలయం.. 51 మంది మృతి.. రెడ్ అలర్ట్ జారీ!

- హిమాచల్ ప్రదేశ్‌ను ముంచెత్తుతున్న భారీ వర్షాలు, వరదలు
- జూన్ 20 నుంచి ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయిన 51 మంది
- వరద సంబంధిత ఘటనల్లో మరో 22 మంది గల్లంతు
- ఉగ్రరూపం దాల్చిన బియాస్ నది, పలు జిల్లాల్లో రెడ్ అలర్ట్
- మండీ జిల్లాలోనే అత్యధికంగా 10 మంది మృతి



**పెన్ పవర్ డెస్క్:**హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో అతలాకుతలమవుతోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న కుండపోత వానలకు జనజీవనం స్తంభించిపోయింది. ప్రకృతి సృష్టిస్తున్న ఈ బీభత్సానికి ఇప్పటివరకు 51 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 22 మంది గల్లంతయ్యారని అధికారులు అధికారికంగా ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో భారత వాతావరణ శాఖ (%×వీణ%) రెడ్ అలర్ట్ జారీ చేసింది.రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ ఎమర్జెన్సీ వివరాలు 2లో..

## బీఆర్ఎస్ లో అంతర్గత పోరు ఉంది

- హరీశ్ రావును ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ పై పయ్యావుల కేశవ్ విమర్శలు
- ఉనికి కోసం హరీశ్ రావు బనకచర్ల గురించి మాట్లాడుతున్నారని వ్యాఖ్య
- అనవసర వివాదాలు సృష్టించవద్దని హితవు



**పెన్ పవర్ డెస్క్:**బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని బీఆర్ఎస్ కేవలం రాజకీయ లబ్ధి కోసమే తెరపైకి తెచ్చిందని ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ లో నెలకొన్న అంతర్గత పోరులో భాగంగానే కొందరు నేతలు తమ ఉనికిని కాపాడుకోవడానికి ఈ వివాదాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. అనంతపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బనకచర్ల వివరాలు 2లో..

## విదేశాల్లో మెడికల్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులపై పోలీసులతో దాడులు చేయిస్తారా?

- వైద్య విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దంటూ ప్రభుత్వానికి జగన్ హెచ్చరిక
- విదేశీ వైద్య విద్యార్థులపై పోలీసులతో దాడులు చేయించడం దారుణమని ఆగ్రహం
- పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నంబర్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపణ
- ప్రైవేట్ కాలేజీలకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వ కుట్ర అని వివరణ
- తాము తెచ్చిన మెడికల్ కాలేజీలను టీడీపీ అడ్డుకుంటోందని విమర్శ



**పెన్ పవర్ డెస్క్:**చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విదేశాల్లో వైద్య విద్యను పూర్తిచేసిన విద్యార్థుల పట్ల దారుణంగా వ్యవహరిస్తోందని, వారిపై పోలీసులతో దాడులు చేయించడం దుర్మార్గమని వైసీపీ అధినేత వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ఆయన వివరాలు 2లో..

## ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా!

- సర్వీస్ ఉండగానే ఐపీఎస్‌కు గుడ్ బై చెప్పిన సిద్ధార్థ్ కౌశల్
- డీజీపీకి రాజీనామా లేఖ పంపిన ఐపీఎస్ అధికారి
- వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేశానని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ తన సర్వీసుకు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రెండు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో అందించిన సేవలకు ఆయన ముగింపు పలికారు. ఇది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని, ఎలాంటి ఒత్తిళ్లు లేవని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.చాలాకాలంగా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నానని వివరాలు 2లో..

## నేరాలు చేస్తే అమెరికా పౌరులైనా వదలం... దేశం దాటిస్తాం



**పెన్ పవర్ డెస్క్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. తీవ్రమైన నేరాలకు పాల్పడే అమెరికా పౌరులను కూడా దేశం నుంచి బహిష్కరించాలనే కొత్త ఆలోచనను ఆయన తాజాగా బయటపెట్టారు. అయితే, ఈ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమయ్యే అవకాశం ఉందని న్యాయ నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లోరిడా ఎవర్‌గ్లేడ్స్‌లోని వలసదారుల నిర్బంధ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. అమెరికా వివరాలు 2లో..

- తీవ్ర నేరాలకు పాల్పడే అమెరికా పౌరులను దేశం నుంచి బహిష్కరించాలని ట్రంప్ ప్రతిపాదన
- ఫ్లోరిడాలోని వలసదారుల నిర్బంధ కేంద్రంలో సంచలన వ్యాఖ్యలు
- దేశంలో పుట్టినవారికైనా, పౌరసత్వం పొందినవారికైనా ఇది వర్తిస్తుందని వ్యాఖ్య
- దీనిపై చట్టపరమైన స్పష్టత లేదని స్వయంగా అంగీకారం
- ఈ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమని న్యాయ నిపుణుల హెచ్చరిక
- కొన్ని నేరాలకు పాల్పడిన సహజ పౌరుల పౌరసత్వం రద్దుకు ఇప్పటికే చర్యలు

# ఎడిటర్ వ్యూ

## నిర్ణయం ఆలస్యమా? ‘

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేశారు. అయితే పార్టీ కేంద్ర నాయకత్వం మాత్రం ఇంకా రాజీనామాను ఆమోదించలేదు. రాజీనామా విషయంలోనిర్ణయం తీసుకునేందుకు మరికొంత సమయం తీసుకునే అవకాశముందని తెలిసింది. దీంతో పాటు రాజాసింగ్ ను ఖచ్చితంగా పార్టీ కేంద్ర నాయకత్వం వదులుకోదన్న వాదన కూడా వినపడుతుంది. కరడు గట్టిన హిందుత్వవాదిగా తెలంగాణలో అందరూ ఓడిపోయినా ఒకే ఒక్కడు బీజేపీ నుంచి గెలిచి చరిత్ర సృష్టించార. మూడు సార్ల నుంచి గెలిచిన రాజాసింగ్ ను పార్టీ అంత సులువుగా వదులుకోదన్నది పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. రాజాసింగ్ పై గతంలో సస్పెన్షన్ విధించినా తర్వాత ఎత్తివేసి పార్టీలోకి తీసుకున్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు.

**ఆవేశంతో రాజీనామా చేశారని..**

పార్టీ అధ్యక్ష పదవికి తనను నామినేషన్ వేయనివ్వలేదని ఆయన తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపారు. అయితే రాష్ట్ర నాయకత్వం మాత్రం రాజాసింగ్ రాజీనామా లేఖను పార్టీ జాతీయ నాయకత్వానికి పంపింది. గోషామహల్ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్ తనకు పార్టీలో ప్రాధాన్యత లభించడం లేదని భావిస్తున్నారు. అందుకే ఆయన ఫ్రస్టేషన్ కు గురయి ఆవేశంగా రాజీనామా లేఖను సమర్పించి ఉండవచ్చని అంటున్నారు. కొంత సమయం ఇస్తే ఆయన కూడా సర్దుకుపోతారని భావించి నిర్ణయంలో కొంత సమయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

**ఖచ్చితంగా గెలిచే సీటును...**

ఖచ్చితంగా బీజేపీ ఖాతాలో పడే సీటు గోషామహల్. అక్కడ నుంచి గెలిచిన రాజాసింగ్ ను దూరం చేసుకుంటే మంచిది కాదని కేంద్ర నాయకత్వం కూడా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇటు రాజాసింగ్ కూడా రాజీనామా చేసిన రోజు కంటే తర్వాత కొంత దిగి వచ్చినట్లే కనపడుతుంది. పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయం మేరకు నడచుకుంటానని ఆయన చెబుతున్నారు. పార్టీ జాతీయ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తనకు పరవాలేదని, తాను రాష్ట్రంలో ఏ పార్టీలోకి వెళ్లనని, తనకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సిద్ధాంతాలు పడవని చెబుతున్నారు. మహారాష్ట్ర రాజకీయాలకు వెళ్లిపోతానని అంటున్నారు. అక్కడ శివసేనలో చేరే అవకాశాలున్నాయని అంటున్నా రాజాసింగ్ పై చర్యలు ఉండబోవన్నది అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

## బీఆర్ఎస్ లో అంతర్గత పోరు ఉంది

- మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేస్తున్న విమర్శల వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని పయ్యావుల అన్నారు. “బీఆర్ఎస్ లో అంతర్గత సమస్యలు నడుస్తున్నాయి. అందులో భాగంగానే హరీశ్ రావు తన ఉనికిని చాటుకోవడానికి బనకచర్ల అంశాన్ని వాడుకుంటున్నారు. ఇది పూర్తిగా ఆయన సృష్టిస్తున్న రాజకీయ డ్రామా. మిగతా నేతలు కూడా ఆయన ట్రాప్‌లో పడి మాట్లాడుతున్నారు” అని పయ్యావుల వివరించారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్కడా స్పందించకపోవడాన్ని ఆయన ప్రస్తావిస్తూ, ఇది వారి అంతర్గత గొడవేనని స్పష్టం చేశారు.

బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి నష్టమూ వాటిల్లదని మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. “కిందకు వృథాగా పోయే నీటిని మాత్రమే వాడుకుంటున్నాం. దీనివల్ల ఎగువ రాష్ట్రాలకు ఏమాత్రం ఇబ్బంది ఉండదు. ఈ విషయం తెలిసి కూడా కేవలం రాజకీయ ఉద్దేశాలతోనే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారు” అని ఆయన అన్నారు.గతంలో తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను కూడా పయ్యావుల ఈ సందర్భంగా గుర్తుచేశారు. “రాయలసీమకు గోదావరి జలాలు రావాలని గతంలో కేసీఆర్ స్వయంగా చెప్పలేదా?” అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇప్పుడు ఆయన పార్టీ నేతలే అందుకు విరుద్ధంగా మాట్లాడటం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పయ్యావుల విమర్శించారు. అనవసర వివాదాలు సృష్టించి రెండు రాష్ట్రాల మధ్య అపోహలు పెంచవద్దని ఆయన హితవు పలికారు.

## ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా!

- మొదటి పేజీ తరువాయి

సిద్ధార్థ్ కౌశల్ తన ప్రకటనలో తెలిపారు. తన భవిష్యత్ జీవిత లక్ష్యాలకు, కుటుంబ సభ్యుల ఆకాంక్షలకు అనుగుణంగానే సర్వీసు నుంచి వైదొలగుతున్నట్లు వివరించారు. కొన్ని మీడియా మాధ్యమాల్లో వస్తున్నట్లుగా వేధింపులు లేదా బాహ్య ఒత్తిళ్ల కారణంగా తాను రాజీనామా చేశానన్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. “ఈ వార్తలు పూర్తిగా నిరాధారమైనవి, తప్పుదారి పట్టించేవి. నా నిర్ణయం పూర్తిగా స్వతంత్రమైనది, వ్యక్తిగతమైనది, స్వచ్ఛందమైనది” అని ఆయన స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో పనిచేయడం ఒక గౌరవంగా భావిస్తున్నానని కౌశల్ పేర్కొన్నారు. “ఐపీఎస్ అధికారిగా పనిచేయడం నా జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన, విలువైన ప్రయాణం. నేను ఈ రాష్ట్రాన్ని ఎప్పుడూ నా సొంతిల్లుగానే భావించాను. ఇక్కడి ప్రజలు ఎప్పటికీ నా హృదయంలో ప్రత్యేక స్థానంలో ఉంటారు” అని ఆయన అన్నారు. తన వృత్తి జీవితంలో తనకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, సీనియర్ అధికారులకు, సహోద్యోగులకు, సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. “మీ మద్దతు, విశ్వాసమే నన్ను ఒక అధికారిగా, వ్యక్తిగా తీర్చిదిద్దాయి” అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ కొత్త మార్గాల్లో సమాజానికి సేవ చేస్తానని సిద్ధార్థ్ కౌశల్ ఆశాభావం వ్యక్తం చేశారు. 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన సిద్ధార్థ్ కౌశల్, గతంలో కృష్ణా, ప్రకాశం, వైస్సార్ కడప జిల్లాల ఎస్పీగా, రాష్ట్ర లా అండ్ ఆర్డర్ ఐజీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన తన అధికారిక ప్రకటనలో భవిష్యత్ ప్రణాళికల గురించి ఏమీ ప్రస్తావించనప్పటికీ, ఢిల్లీ కేంద్రంగా ఒక కార్పొరేట్ సంస్థలో చేరవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు.

# బానిసగాబతకడం కన్నా జైలులోని చీకటి గదే మేలు

పాకిస్థాన్ పాలకులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, వారి బానిసత్వంలో మగ్గిపోవడం కంటే జైలులోని చీకటి గదిలో జీవించడానికే తాను ఇష్టపడతానని మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం జైలు జీవితం గడుపుతున్న ఆయన, ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన చట్ట సవరణలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నిరంకుశ పాలకులపై దేశవ్యాప్తంగా పోరాటం చేయాలని తన పార్టీ కార్యకర్తలకు, మద్దతుదారులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా ఓ సందేశాన్ని విడుదల చేశారు. పాకిస్థాన్ ప్రభుత్వం ఇటీవల చేసిన 26వ రాజ్యాంగ సవరణ ప్రజాస్వామ్య మూలాలను దెబ్బతీసిందని ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. “ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు, చట్టబద్ధమైన పాలన, నైతిక విలువలు, మీడియా స్వేచ్ఛ అనేవి నాలుగు ముఖ్యమైన స్తంభాలు. కానీ తాజా సవరణ వీటన్నింటినీ నాశనం చేసింది. ఈ నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా జులై 6వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పోరాడాలని పాకిస్థాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పీటీఐ) కార్యకర్తలకు, ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను” అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తన సందేశాలు ప్రజలకు చేరకుండా అన్ని విధాలుగా అడ్డుకుంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పై కూడా ఇమ్రాన్ ఖాన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. “ఒక నియంత అధికారంలోకి వస్తే ఓట్లతో పని ఉండదు. తన ఇష్టానుసారం ప్రయోగాలు చేస్తూ పాలన సాగిస్తాడు” అని పరోక్షంగా విమర్శించారు. దేశ న్యాయవ్యవస్థపైనా ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. న్యాయస్థానాల్లో ‘ఎంపిక చేసిన’ న్యాయమూర్తులే ఉన్నారని, స్వతంత్రంగా వ్యవహరించే వారికి శక్తి లేకుండా పోయిందని అన్నారు. దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ కనుమరుగైందని, నిజాయతీగా పనిచేసే జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు.

## ఏడాది కాలంగా ఇదే మా పాలసీ

- మొదటి పేజీ తరువాయి

సృష్టించి, దానిని సంక్షేమ పథకాలకు ఖర్చు చేయడమే సరైన ఆర్థిక విధానమని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం గత ఏడాదిగా ఇదే పాలసీని అనుసరిస్తోందని వివరించారు.

‘స్వర్ణ కుప్పం’ ప్రాజెక్టు కింద నియోజకవర్గంలో మొత్తం రూ. 1292 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే రూ. 125 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నియోజకవర్గంలోని రహదారులన్నింటినీ సీసీ, బీటీ రోడ్లుగా మార్చనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా గుంతలు లేని రహదారులను నిర్మించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతోనే ఏడాదిగా సుపరిపాలన అందిస్తున్నామని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా మహిళల కోసం ‘దీపం 2.0’ పథకాన్ని ప్రస్తావించారు. గతంలో తాము ప్రవేశపెట్టిన ‘దీపం’ పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందిస్తే, ఇప్పుడు ‘దీపం 2.0’ ద్వారా అర్హులైన మహిళలందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు. దీనివల్ల కుప్పం నియోజకవర్గంలోని ప్రతి ఇంటిలోనూ వంట గ్యాస్ అందుబాటులోకి వచ్చిందని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. సుపరిపాలనలో భాగంగానే ప్రజల ముందుకు వచ్చానని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

## నేరాలు చేస్తే అమెరికా పౌరులైనా వదలం... దేశం దాటిస్తాం

- మొదటి పేజీ తరువాయి

పౌరసత్వం పొందిన కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. “వారు మన దేశానికి కొత్త కాదు, చాలా కాలంగా ఇక్కడే ఉంటున్నారు. వారిలో చాలామంది ఇక్కడే పుట్టారు. నిజం చెప్పాలంటే, వాళ్లను కూడా ఇక్కడి నుంచి తరిమికొట్టాలని నేను భావిస్తున్నాను. బహుశా ఇదే మా తదుపరి పని కావచ్చు” అని ఏబీసీ న్యూస్ కథనం ప్రకారం ట్రంప్ వ్యాఖ్యానించారు.అయితే, తన ప్రతిపాదనకు చట్టపరమైన వెసులుబాటు ఉందో లేదో తనకు కచ్చితంగా తెలియదని ట్రంప్ అంగీకరించడం గమనార్హం. “చట్టపరంగా మాకు ఆ హక్కు ఉందో లేదో తెలుసుకోవాలి. ఒకవేళ ఆ అధికారం ఉంటే మాత్రం, ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఆ పని చేస్తాను. ప్రస్తుతం దానిపైనే మేం దృష్టి సారించాం” అని ఆయన స్పష్టం చేశారు.

ట్రంప్ వ్యాఖ్యలకు కొన్ని వారాల ముందే, ఆయన నియమించిన సహాయ అటార్నీ జనరల్ బ్రెట్ షుమేట్ ఒక మెమో జారీ చేశారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఉన్న కేసుల్లో పౌరసత్వం రద్దు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన యూఎస్ అటార్నీలను ప్రోత్సహించారు. ముఖ్యంగా వేధింపులు, యుద్ధ నేరాలు, మానవ అక్రమ రవాణా, మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని లక్ష్యంగా చేసుకోవాలని ఆ మెమోలో పేర్కొన్నారు.

మరోవైపు, నేరాలకు పాల్పడ్డారనే కారణంతో, అమెరికా గడ్డపై సహజంగా జన్మించిన లేదా సహజ పౌరసత్వం పొందిన వారిని దేశం నుంచి బహిష్కరించడం రాజ్యాంగంలోని ఎనిమిదో సవరణను ఉల్లంఘించడమే అవుతుందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రూరమైన, అసాధారణ శిక్షలను ఈ సవరణ నిషేధిస్తుందని వారు గుర్తు చేస్తున్నారు.

వర్జీనియా యూనివర్సిటీకి చెందిన న్యాయశాస్త్ర ప్రొఫెసర్ అమండా ఫ్రాస్ట్ మాట్లాడుతూ, “పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసానికి పాల్పడటం లేదా దేశద్రోహం వంటి నిర్దిష్ట సందర్భాల్లో మాత్రమే సహజ పౌరుల హోదాను రద్దు చేయగలరు. అంతేకానీ, సంబంధం లేని నేరాలను కారణంగా చూపి ఒకరి పౌరసత్వాన్ని రద్దు చేసి, వారిని దేశం నుంచి బహిష్కరించడం కుదరదు” అని ఏబీసీ న్యూస్‌కు వివరించారు. ట్రంప్ సందర్శించిన ఈ నిర్బంధ కేంద్రాన్ని, కఠిన వలస విధానాల కారణంగా విమర్శకులు ‘అలిగేటర్ అల్కాట్రాజ్’ అని పిలుస్తుండగా, ట్రంప్ మాత్రం ఆ వివాదాన్ని పట్టించుకోకుండా తన పర్యటనను పూర్తి చేశారు.

## జగన్ పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన బైరెడ్డి శబరి

వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్.. వైసీపీ విధానాలపై, జగన్‌పై వేర్వేరు కార్యక్రమాల్లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలో నిర్వహించిన ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమంలో ఎంపీ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. “గడిచిన ఐదేళ్లలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలి. అది చేయకుండా చిల్లర రాజకీయాలతో పాదయాత్ర అంటూ వస్తే ప్రజలే చెప్పులతో కొడతారు” అని జగన్‌ను ఉద్దేశించి తీవ్రంగా హెచ్చరించారు.

జగన్ ఐదేళ్ల పాలనలో చేయలేని అభివృద్ధిని, తమ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే చేసి చూపించిందని శబరి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నామని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కూడా పాల్గొన్నారు.మరోవైపు, శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కూడా వైసీపీపై విమర్శలు చేశారు. స్థానికంగా జరిగిన ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కదిరిలో వైసీపీ నేతలపై జరుగుతున్న సీబీఐ దాడుల గురించి ప్రస్తావించారు. “దేశవ్యాప్తంగా 33 ప్రాంతాల్లో సీబీఐ సోదాలు చేస్తుంటే, అందులో కదిరి వైసీపీ నేతలు ఉండటం సిగ్గుచేటు” అని ఆయన ఎద్దేవా చేశారు.

## విదేశాల్లో మెడికల్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులపై పోలీసులతో దాడులు చేయిస్తారా?

- మొదటి పేజీ తరువాయి

స్పంది స్తూ, ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ఇది దౌర్భాగ్యపు ప్రభుత్వం కాదా అని ప్రశ్నిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మండిపడ్డారు.

**పీఆర్ నంబర్ల జారీలో ఎందుకింత జాప్యం?**

విదేశాల్లో వైద్య విద్య పూర్తిచేసిన విద్యార్థులు, నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాల ప్రకారం ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ (ఎఫ్ఎంజీ) పరీక్షలో ఉత్తీర్ణులై, రాష్ట్రంలోనే ఇంటర్న్‌షిప్ కూడా పూర్తిచేశారని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ, వారికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (పీఆర్) నంబర్ ఇవ్వకుండా ప్రభుత్వం ఎందుకు వేధిస్తోందని నిలదీశారు. ఇది కేవలం ఒక లాంఛనమే అయినా, దాన్ని కూడా పూర్తిచేయకుండా వారిని ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ వివక్షకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించినందుకు విద్యార్థులపై దాడులు చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

**ప్రైవేట్ కాలేజీల కోసమే కుట్ర అని ఆరోపణ**

గత ఏడాది కాలంగా ప్రభుత్వం ఈ విద్యార్థుల పట్ల వివక్ష చూపుతోందని జగన్ ఆరోపించారు. ఇంటర్న్‌షిప్ పేరుతో వారిచేత వెట్టిచాకిరి చేయించుకుంటూ, ప్రైవేటు మెడికల్ కాలేజీలకు లాభం చేకూర్చేందుకే ఉద్దేశపూర్వకంగా పీఆర్ నంబర్లు ఇవ్వడంలేదని విమర్శించారు. తల్లిదండ్రులు అప్పులు చేసి, ఆస్తులు అమ్మి పిల్లలను డాక్టర్లుగా చూడాలని విదేశాలకు పంపిస్తే, ప్రభుత్వం వారిని అంటరానివారిగా చూస్తూ కెరీర్‌ను నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది విద్యార్థులను నిరుత్సాహపరిచే కుట్రలో భాగమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

**మెడికల్ కాలేజీల అంశంపైనా విమర్శలు**

రాష్ట్ర విద్యార్థులు విదేశాలకు వెళ్లే అవసరం లేకుండా, తమ ప్రభుత్వం 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని జగన్ తెలిపారు. వాటి ద్వారా 2,550 సీట్లు అందుబాటులోకి తెచ్చే ప్రక్రియను ప్రారంభించి, ఐదు కాలేజీలను కూడా మొదలుపెట్టామని

గుర్తుచేశారు. మిగిలిన కాలేజీలు పూర్తిచేసే దశలో ఉండగా, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం వాటిని పూర్తిగా అడ్డుకుందని ఆరోపించారు. దేశ చరిత్రలోనే... కేంద్ర ప్రభుత్వం కేటాయించిన సీట్లను వద్దని చెప్పిన ఏకైక ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమని, పులివెందుల మెడికల్ కాలేజీకి కేటాయించిన సీట్లను కూడా వద్దంటూ ఎన్ఎంసీకి లేఖ రాశారని విమర్శించారు. అవినీతి, స్కామ్‌ల కోసం ప్రభుత్వ కాలేజీలను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు.

**తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్**

కష్టపడి చదివి వచ్చిన విద్యార్థులను అడిగినందుకు పోలీస్ స్టేషన్లలో పెట్టించడం దారుణమని జగన్ అన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ప్రభుత్వానికి ఇంత పగ ఎందుకని ప్రశ్నించారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన వారికి వెంటనే రిలీవింగ్ ఆర్డర్లు ఇచ్చి, ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నంబర్లను తక్షణమే జారీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష

- మొదటి పేజీ తరువాయి

నేతృత్వంలోని అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్-1కు చెందిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ సంచలన తీర్పును వెలువరించింది. ఇదే కేసులో సంబంధం ఉన్న గైబంధా ప్రాంతానికి చెందిన షకీల్ ఆకంద్ బుల్బుల్‌కు కూడా రెండు నెలల జైలు శిక్ష విధించినట్లు ట్రైబ్యునల్ స్పష్టం చేసింది.షేక్ హసీనా ప్రస్తుతం కేవలం కోర్టు ధిక్కరణ కేసులోనే కాకుండా, అంతకంటే తీవ్రమైన ఆరోపణలను కూడా ఎదుర్కొంటున్నారు. గత ఏడాది తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన భారీ నిరసనల సమయంలో అమానవీయ రీతిలో నేరాలకు పాల్పడ్డారంటూ ఆమెపై అధికారికంగా అభియోగాలు నమోదయ్యాయి. నిరసనకారులపై షేక్ హసీనా ‘పద్ధతి ప్రకారం దాడులు’ చేయించారని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తాజుల్ ఇస్లాం ఆరోపించారు.ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదిక ప్రకారం, 2024 జూలై 15 నుంచి ఆగస్టు 15 మధ్య జరిగిన ఆ హింసాత్మక ఘటనల్లో సుమారు 1,400 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. అయితే, తనపై మోపిన అన్ని ఆరోపణలను షేక్ హసీనా మొదటి నుంచి ఖండిస్తూ వస్తున్నారు. ఈ ఆరోపణలపై వాదనలు వినిపిస్తామని ఆమె తరఫు న్యాయవాది అమీర్ హుస్సేన్ మీడియాకు తెలిపారు.

## ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి.. రైతులకు అండగా నిలుస్తాం

- మొదటి పేజీ తరువాయి

ఈ వ్యవసాయ కుంటలు కరవు పరిస్థితుల్లో కూడా రైతులకు ఆసరాగా నిలుస్తాయని పవన్ పేర్కొన్నారు. వీటి నిర్మాణం ద్వారా నిస్సారమైన భూములకు సైతం జీవం పోయవచ్చని, భూగర్భ జలాల మట్టం పెరగడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ ఫామ్ పాండ్స్ వల్ల ఇప్పటివరకు సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెరిగిందని, అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ శ్రామికులకు పని కల్పించినట్టు అయిందని ఆయన తెలిపారు. రైతుల సహకారంతోనే ఈ బృహత్కార్యం సాధ్యమైందని పవన్ అన్నారు. వ్యవసాయ కుంటల ఆవశ్యకతను గ్రహించి, తమ పొలాల్లో వాటిని తవ్వించుకోవడానికి ముందుకు వచ్చిన రైతులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, ఈ యజ్ఞంలో పాలుపంచుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి మొదలుకొని క్షేత్రస్థాయి సహాయకుల వరకు సిబ్బందికి, ఉపాధి హామీ కూలీలకు ఆయన పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని పవన్ పేర్కొన్నారు. ఇందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు తెలియజేశారు.

## చంద్రబాబును కాపాడాలి.. కేసీఆర్ ను తిట్టాలి.. ఇదే రేవంత్ రెడ్డి పని

- మొదటి పేజీ తరువాయి

మాజీ ముఖ్యమంత్రి కేసీ ఆర్‌ను నిందించడం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కాపాడటమే రేవంత్ పని అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

బనకచర్ల ప్రాజెక్టుపై ప్రభుత్వం యుద్ధం ప్రకటిస్తుందని ఆశిస్తే, అందుకు భిన్నంగా పాత పాటనే పాడారని గంగుల ఎద్దేవా చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పేరుతో లక్షల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారని మండిపడ్డారు. ఈ అంశంపై మాజీ మంత్రి హరీశ్ రావు వాస్తవాలను బయటపెట్టి, ప్రభుత్వాన్ని నిద్రలేపారని అన్నారు. అంతకుముందు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేవలం లేఖ రాయడంతోనే సరిపెట్టారని, సమస్య తీవ్రతను కేంద్రానికి వివరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. “ప్రభుత్వం వద్ద సరైన సమాచారం లేదు. ఎంతసేపూ రోజా రొయ్యల పులుసు గురించి మాట్లాడటం తప్ప రేవంత్, ఉత్తమ్‌లకు విషయంపై పట్టు లేదు” అని గంగుల వ్యాఖ్యానించారు. కేసీఆర్ గోదావరి జలాలు వాడుకోమని చెప్పడం బనకచర్లకు అనుమతి ఇచ్చినట్టు ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. బనకచర్ల అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం వెంటనే అసెంబ్లీని సమావేశపరచాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, “వచ్చే సోమవారమే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలి. మా తరఫున హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి లేదా మరెవరైనా ప్రజెంటేషన్ ఇవ్వాలి” అని సవాల్ విసిరారు. బనకచర్లకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు నిరాకరించడం బీఆర్ఎస్ సాధించిన విజయమని, ప్రాజెక్టు పూర్తిగా ఆగిపోయే వరకు తమ పోరాటం కొనసాగుతుందని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కేసీఆర్‌ను దోషిగా నిలబెట్టాలని రేవంత్ రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి ఫలించవని పేర్కొన్నారు.ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, రేవంత్ రెడ్డికి బనకచర్ల ప్రాజెక్టు కన్నా కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకోవడమే ముఖ్యమైందని అన్నారు. గోదావరి ట్రిబ్యునల్ ద్వారా ఏపీకి అదనపు నీటి కేటాయింపులు సాధించుకునేందుకే చంద్రబాబు బనకచర్ల పథకానికి రూపకల్పన చేశారని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి ఎందుకు తీసుకెళ్లడం లేదని ఆయన నిలదీశారు. ఈ సమావేశంలో మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే డాక్టర్ కె. సంజయ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ తదితరులు పాల్గొన్నారు.

## హిమాచల్‌లో జల విలయం.. 51 మంది మృతి.. రెడ్ అలర్ట్ జారీ!

- మొదటి పేజీ తరువాయి

ఆపరేషన్ సెంటర్ ఈ విపత్తుపై ఒక నివేదికను విడుదల చేసింది. జూన్ 20 నుంచి జూలై 2వ తేదీ వరకు జరిగిన నష్టాన్ని ఈ నివేదికలో పొందుపరిచింది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడటం వంటి వర్ష సంబంధిత ప్రమాదాల కారణంగా రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ఈ మరణాలు సంభవించాయని తెలిపింది. ఈ ఘటనల్లో సుమారు 103 మంది గాయపడినట్లు నివేదిక వెల్లడించింది. అత్యధికంగా మండీ జిల్లాలో 10 మంది చనిపోయారని తెలిపింది.

భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని ప్రధాన నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా మండీ జిల్లాలో బియాస్ నది ఉప్పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. చండీగఢ్-మనాలీ జాతీయ రహదారిపై పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ముందుజాగ్రత్త చర్యగా మండీ, సిర్మౌర్ జిల్లాల్లో సుమారు 250కి పైగా రహదారులను అధికారులు మూసివేశారు. పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వరదల కారణంగా 614 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 130 మంచినీటి సరఫరా పథకాలు దెబ్బతిన్నాయని, దీంతో విద్యుత్, నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు ముమ్మరం చేశాయి.

# అభివృద్ధికి, సంక్షేమానికి సైకిలే బెస్ట్

**కుప్పం ప్రజా వేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



**కుప్పం, పెన్ పవర్ జులై 2 :** విధ్వంసమైన రాష్ట్రాన్ని వికాసం వైపు అడుగులు వేయిస్తూ.. సంక్షేమం అభివృద్ధి చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తూ.. ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకుగా పని చేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రెండు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.1292.74 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ, ప్రత్యేక పథకాల ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే కుప్పంలో రూ.1271.65 కోట్ల పెట్టుబడులు పెట్టే వివిధ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం, తుంసీ ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజా వేదిక తరువాయి 4లో..

# పెన్ పవర్

## వై.ఎస్.ఆర్. కడప
## అన్నమయ్య జిల్లా




# కుప్పం రూపురేఖలే మారుస్తాం



## బ్రాండ్ కుప్పం ఎస్టాబ్లిష్ చేస్తాం - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**కుప్పం పెన్ పవర్ జూలై 02 :** గతంలో బ్రాండ్ కుప్పం అనేది లేదు. ఇప్పుడు ఆ దిశగా కుప్పంలో తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తాం. కుప్పంలో ఎయిర్ పోర్టు రాబోతోంది. ఎయిర్ పోర్టు అంటే అభివృద్ధి. రూ.850 కోట్లను కుప్పం విమానాశ్రయానికి ఖర్చు చేస్తామని, విమానాశ్రయానికి భూములివ్వొద్దని కొందరు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నా, ఎయిర్ పోర్టుకు భూమి ఇచ్చిన వారికి మెరుగైన ప్యాకేజీ ఇస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. అమరావతి రాజధానికి భూములిచ్చారని, రాజధాని రైతులకూ ప్యాకేజీ ఇస్తామన్నారు.

కుప్పంలో ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానెల్ ఉండాలని, ఉండేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్ పెట్టుకునేంత వరకు నేను మీ వెంట పడతానని, ఇళ్లపై రూఫ్ టాప్ ద్వారా మనమే సొంతగా విద్యుత్ తయారు చేసుకోవచ్చునని, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగానే పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీసీలకు 40 శాతం రాయితీ కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సూర్యఘర్ పథకాన్ని పూర్తిగా వినియోగించుకుంటే కరెంటు కోతల పరిస్థితి ఉండదని కరెంటు ఛార్జీలు కట్టే పరిస్థితి ఉండదన్నారు. కుప్పంలో ఏసీల అవసరం ఉండదు కానీ.. అవసరమైతే ఏసీలకు సోలార్ విద్యుత్ పెట్టుకోవచ్చునన్నారు. ఇళ్లకే కాదు వ్యవసాయానికి సోలార్ విద్యుత్ వినియోగించుకోవాలని, వ్యవసాయ మోటార్లకు సోలార్ ప్యానెళ్లు బిగించుకోవచ్చునని, కేంద్ర ప్రభుత్వ పథకం కింద మోటార్లకు సోలార్ ప్యానెళ్లు బిగిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. కుప్పం రైల్వే స్టేషన్ ఆధునీకరిస్తాం, చెన్నైకి, బెంగళూరుకు వెళ్లే వారికి మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. పలమనేరు నుంచి కృష్ణగిరి రహదారికి నాలుగు లేన్ల రహదారి తరువాయి 4లో..



**జిల్లాలో అభివృద్ధి విజన్ ప్లాన్**

# అమలుపై దృష్టి సారించండి

**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**

**వైఎస్సార్ కడప పెన్ పవర్, జూలై 02 :** జిల్లాలో అభివృద్ధి విజన్ ప్లాన్ అమలుపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్‌లో స్వర్ణ ఆంధ్ర విజన్- 2047లో బాగంగా జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్,నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ పై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి నియోజకవర్గ స్పెషల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం దూర దృష్టితో స్వర్ణ ఆంధ్ర విజన్ ఏ2047 తీసుకురావడం జరిగిందన్నారు.స్వర్ణ ఆంధ్ర విజన్ 2047 యాక్షన్ ప్లాన్ లో భాగంగా జిల్లా, నియోజకవర్గ,మండలాల అభివృద్ధి విజన్ ప్లాన్‌పై ప్రతి ఒక్క నియోజకవర్గ స్పెషల్ అధికారులు, మండల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీరో పావర్టీ, పి.4 పాలసీలను అధికారులు అర్థం చేసుకొవాలన్నారు.మనం సమాజం ద్వారా అభివృద్ధి చెందుతున్నా మని ప్రతి ఒక్కరూ తిరిగి సమాజానికి ఎంతోకొంత సేవలు అందించాలన్నదే పి 4 పాలసీ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ పాలసీ ద్వారా గ్రామాల్లో ఉన్న నిరు పేదలను కనీస స్థాయికి తీసుకురావాలన్నారు. బాగా అభివృద్ధి చెందిన రైతులు ఇతర రైతులకు మెలకువలు నేర్పించి సహకారం అందించం, సమాజంలో విజయవంతమైన వారు ఇతరులకు సహకారాన్ని అందించడం, నాలెడ్జ్ షేరింగ్ లాంటి అంశాలు పి4 పాలసీలో ఇమిడి ఉన్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 76 వేలకు పైగా బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. మార్గదర్శుల ద్వారా బంగారు కుటుంబాలకు హ్యాండ్ హెూల్డింగ్ ఇచ్చి పేదరికం నుంచి బయటకు తీసుకురావాలన్నారు. అలాగే మార్గదర్శిల కాన్సెప్ట్ ను అధికారులు పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో మండలాల్లో విజయవంతమైన రైతు పారిశ్రామికవేత్త, టీచర్, సాఫ్ట్వేర్ ఉద్యోగి, స్వయం సహాయక సంఘం సభ్యులు ప్రతి ఒక్కరూ మార్గదర్శులేనున్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఫీల్డ్ స్థాయిలో విజిట్ చేసి బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చేలా కృషి చేయాలన్నారు. వచ్చే 4 సం రాలు కీలకమని ప్రధాన రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి వారిని అమలు చేయాలన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామికా భివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని వనరులను వినియోగించుకుని అభివృద్ధి దిశగా జిల్లాను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. పేదరిక నిర్మూలన కోసం జిల్లా, నియోజకవర్గ విజన్ ప్లాన్ అమలులో బాగంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని మండలాలలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించాలన్నారు. మండల స్థాయి అధికారులు మండల విజన్ డాక్యుమెంట్స్ రూపొందించి ప్రెజెంటేషన్ ఇవ్వాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధించడానికి జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు అనుగుణంగా సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీవో హాజరతయ్యా, ఇన్చార్జి డి ఆర్ వో వెంకటపతి, డిఆర్‌డిఎ పిడి రాజ్యలక్ష్మి, కడప ఆర్డిఓ జాన్ ఇర్విన్, బద్వేలు ఆర్టీవో చంద్రమోహన్, జమ్మలమడుగు ఆర్డిఓ సాయి శ్రీ,,డ్వామా పిడి ఆదిశేషారెడ్డి,కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ కుమార్,ఇతర జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# అరటి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



**అనంతపురం పెన్ పవర్,జూలై 2 :** అరటి సంబంధించి టిష్యూ కల్చర్ మొక్కల ఉత్పత్తి మరియు పరిశోధన కొరకు పరిశోధన కేంద్రం ఏర్పాటు కొరకు జిల్లాలోని తాడిపత్రి మండలం భోగసముద్రం, తలారి చెరువు, మరియు వెంకటంపల్లి గ్రామాల నందు అనుకూలమైన స్థలాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి. ఐఏఎస్ పరిశీలించారు. బుధవారం ఉదయం అనంతపురం డివిజన్ రెవెన్యూ అధికారి కేశవ నాయుడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. భారతదేశ కేంద్ర ప్రభుత్వం అధీనంలో పనిచేస్తున్న భారతీయ బీచ్ సహకారి సమితి లిమిటెడ్ (బిబిఎస్ఎస్ఐ) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందు వివిధ పంటల విత్తనాభివృద్ధి కొరకు మరియు ముఖ్యంగా అరటి సంబంధించి టిష్యూ కల్చర్ మొక్కల ఉత్పత్తి మరియు పరిశోధన కొరకు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ప్రతిపాదనలు పంపడం జరిగింది. అలాగే అనంత పురం జిల్లా నందు ఏర్పాటు చేయమని జిల్లా కలెక్టర్ కు సూచనలు జారీ చేసిన నేపథ్యంలో నేడు పలు గ్రామాల స్థలాలను పరిశీలించి కేంద్ర సంస్థకు అనుకూలమైన విధంగా భూములను కలెక్టర్ పరిశీలించారు. 50 ఎకరాలలో అరటి టిష్యూ కల్చర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. సుమారు నాలుగు గంటల పాటు స్థల పరిశీలన కొరకు కలియ తిరుగుతూ వివిధ సర్వే నంబర్లలో స్థలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుత స్థల పరిశీలన అనంతరం భూమి ఎంపిక కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా కేంద్రం ఏర్పాటు లో భాగంగా ప్రభుత్వానికి భూ సేకరణ ప్రతిపాదనలు పంపవలసి ఉన్నందున ప్రస్తుత స్థలాల ప్రాంతాలలో జంతువుల సంచారం, నీటి సౌకర్యం విద్యుత్ సరఫరా, రోడ్డు వసతి, నేల సామర్థ్యం, వాతావరణ పరిస్థితులు అనుకూలతల పైన పరీక్షలు తదితర తరువాయి 4లో..

# కర్నూలు-విజయవాడ మధ్య ఫ్లైట్ సర్వీసులు ప్రారంభం



**కర్నూలు, పెన్ పవర్ జులై 2 :** కర్నూలు - విజయవాడ మధ్య నూతనంగా ఇండిగో విమాన సర్వీసు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు,మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.. ఈ ఫ్లైట్ సర్వీస్ ప్రారంభం సందర్భంగా సహచర మంత్రి టీజీ భరత్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిలతో కలిసి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రయాణికులకు స్వాగతం పలికారు. ఢిల్లీ నుండి వర్చువల్ గాఈ ఫ్లైట్ సర్వీస్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. వారానికి 3 రోజులపాటు కర్నూలు-విజయవాడ మధ్య ఇండిగో సంస్థ ఈ ఫ్లైట్ సర్వీస్‌ను నడపనున్నారు. అతి త్వరలో.. ప్రతిరోజు సర్వీస్ నడిపేలా చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా తెలిపారు. కర్నూల్ నుండి దేశంలో ఇతర ప్రాంతాలకు సర్వీసులు నడిపేలా కృషి చేస్తామని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కర్నూల్ డిప్యూటీ కలెక్టర్, తదితర ఉన్నత అధికారులు..





# గరుడ వాహనంపై శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడు



**తిరుపతి పెన్ పవర్ జూలై 2 :** శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాలలో భాగంగా జూలై 02వ తేదీ గరుడ వాహనంపై శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి విహరించి భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన నిర్వహించారు. ఉదయం 11 నుండి 12 గంటల వరకు ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్స వర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఊంజల్ సేవ చేపట్టారు. సాయంత్రం 06 గం.లకు ఉత్సవ మూర్తులను వాహన మండపంలోకి వేంచేపు చేశారు. సాయంత్రం 6.30 గం.లకు లక్ష్మీ హారాన్ని ఆలయ ప్రదక్షిణగా అలంకార మండపంలోకి తీసుకువచ్చి స్వామి వారిని అలంకరించారు. రాత్రి 7 గంటలకు గరుడ వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు.

**జూలై 03న పార్వేట ఉత్సవం**

జూలై 03వ తేదీన గురువారం ఉదయం 07 - 11 గం.ల వరకు ఉత్సవ మూర్తులు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11.00- 02.00 గం.ల మధ్య పార్వేట ఉత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా ఆస్థానం, వైదిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# స్వర్ణ నారావారిపల్లె-2029 సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి

## అన్ని గ్రామాలలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి కావాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి, పెన్ పవర్ జూలై 2 :** స్వర్ణ నారావారిపల్లె -2029 అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను త్వరితగతిన సిద్ధం చేసి పనులు చేపట్టాలని, అన్ని గ్రామాలలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక కల్లెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు స్వర్ణ నారావారిపల్లె -2029 అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక అధికారిని శ్రీమతి సుశీల దేవి మరియు సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. స్వర్ణ నారావారి పల్లె -2029 లో భాగంగా జరగనున్న అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించి, నారావారిపల్లి అభివృద్ధిని త్వరితగతిన పనులు పూర్తి అయ్యేటట్లు ప్రణాళికను సిద్దం చేసుకొని, అనుమతులు కావాల్సిన శాఖల ద్వారా పరిపాలనా ఉత్తర్వులను పొంది పనులను ప్రారంబించి పూర్తి చేయాలని తెలిపారు. వివిధ శాఖాధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్ లింకేజ్ ద్వారా స్వయం సహాయ సంఘాలకు (రుణాలు మంజూరు చేయాలని, రిటైల్ అవుట్‌లెట్‌లు ఈజీమార్ట్ సహకారంతో రిటైల్ అవుట్‌లెట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రంగానికి సంబంధించి కిచెన్ గార్డెనింగ్, టెర్రస్ గార్డెనింగ్‌పై గుర్తించబడిన కుటుంబాలకు శిక్షణ ఇవ్వాలని, వరి పొలాల్లో ధ్రవ జీవామృతం సుమారు 1000 ఎకరాలలో పిచికారి చేయాలనీ, రైతుల పొలాల్లో PMDS కిట్ల ఏర్పాటు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.



100% సోలరైజేషన్ సంబంధించిన పంచాయతీల్లో సర్వీసులను త్వరగా సోలరైజ్ చేయాలని, విద్యా రంగానికి సంబంధించి అన్ని పాఠశాల భవనాలను, డిజిటల్ లైబ్రరీ, మైదానం లెవలింగ్ వంటి వసతుల కల్పన ఏర్పాటు చేయాలని, ఆరోగ్య & మహిళా సంక్షేమం ద్వారా మహిళా పోలీసులకు ఆన్‌సైట్ స్క్రీనింగ్ అప్లికేషన్‌లపై శిక్షణ, 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో AI ఆధారిత స్క్రీనింగ్‌ల 100% పూర్తి చేయాలని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి ద్వారా CC రోడ్లను, త్రాగునిటీ ట్యాంక్లు, 33/11 కె వి ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్లు పూర్తి చేయాలని తెలిపారు. నారావారిపల్లి CHC, CSC యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, IHHL (వ్యక్తిగత మరుగుదొడ్లు) పనులు మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయాలని, స్వచ్ఛత కోసం హెూం కంపోస్టింగ్ లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎస్.సి, ఎస్.టి లకు అందించిన ఈ-ఆటోల వలన రోజు వారి ఆదాయం గతంతో పోలిస్తే ఎంత ఆదాయ రాబడి వస్తుందో తెలుసుకోవాలని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఎంత మందికి శిక్షణ ఇచ్చారో, ఎంత మందికి ఉపాది కల్పించారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఎటువంటి అసాంఘీక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా చూడాలని సంబందిత స్కూల్ ప్రధాన ఉపాద్యాయులను ఆదేశించారు. పల్లె వనం లు ఏర్పాటు చేయాలనీ, క్యాటిల్ షెడ్ లు అన్ని 100 శాతం పూర్తి చేయాలనీ, విద్యా శక్తి కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అలాగే మిగిలిన శాఖల వారు కావలసిన పరిపాలన అనుమతులను పొంది స్వర్ణ నారావారిపల్లి - 2029 అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారిని శ్రీమతి సుశీల దేవి, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, డ్వామా పిడి శ్రీనివాస్ ప్రసాద్, డిఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, సిపిఓ వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ ఏ.డి డా.ఏ.ప్రసాద్, ఏపీఎంఐపి సతీష్, మార్కెటింగ్ ఏ.డి సురేంద్ర బాబు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్.ఈ సురేంద్ర నాయుడు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్.ఈ పి.వి నరేంద్ర కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ.ఎస్ రాజు, పి.డబ్ల్యు.సి కో-ఆర్డినేటర్ వెంకట్, విద్యా శాఖ, ఐ.సి.డి.ఎస్, నెడ్ క్యాప్, ఆర్&బి, అటవీ శాఖ, టూరిజం, పిడి గృహ నిర్మాణ శాఖ అధికారి, స్వర్ణ నారావారి పల్లి - 2029కి సంబందించిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి మానసిక బాధితుల శ్రేయోభిలాషి

### కడప రిమ్స్‌లో నేత్రాలు, దేహం దానం







**ధర్మవరం పెన్ పవర్ జూలై 2 :** సత్యసాయి జిల్లా ధర్మవరం నందు జూలై రెండవ తేదీన పెన్షనర్ భవంతి నందు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సొసైటీ, జన విజ్ఞాన వేదిక, పెన్షనర్స్ అసోసియేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ధర్మవరం శాఖ ఆధ్వర్యంలో శివారెడ్డి గారి సంస్మరణ సభ , మనోబంధు ప్రతినిధి సత్య నిర్ధారణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చలపతి గారు, జన విజ్ఞాన వేదిక నాయకుడు డాక్టర్ ఆదిశేషు, కార్యకర్త లోకేష్, మెహర్ బాబా సేవా సంస్థ తరపున గంగరాజు సుజాతమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఉపసంచాలకులు నాయక్ గారు పాల్గొన్నారు. కడప జిల్లాలో మానసిక వైద్యశాల యందు వందలాది మందిని రోడ్డుపై తిరిగే రహదారి మానసిక బాధితులను ఆసుపత్రి నందు చేర్పించి, ఆరోగ్యం కుదుటపడిన తర్వాత పునరావాసం కల్పించడంలో మనోబంధు సంస్థ తరపున ఎంతో కృషి చేశారని సత్య నిర్ధారణ తెలిపారు. జన విజ్ఞాన వేదిక నాయకుడు ఆదిశేషు మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా హేతువాద ఉద్యమాలు చేస్తూ, మనందరికీ పరిచయమైన శివారెడ్డి గారు మరణించడం బాధాకరమని ఆయన ఆశయాలు హేతువాదులుగా మనం కొనసాగించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఉపసంచాలకుల వారి ఆధ్వర్యంలో రెండు నిమిషములు మౌనం పాటించి తదనంతరం శివారెడ్డి గారి గురించి మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు వైవిధ్యమని విలువైనవని ఆ సేవలు కుంటు పడకుండా స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర వహించాలని తెలిపారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ శివారెడ్డి వ్యక్తి కాదు సామాజిక శక్తి, ఆయన సేవలు మనం మననం చేసుకుంటూ, ఆయన చేసిన హేతువాద పోరాటాలు విద్యార్థులకు తెలియజేయాలని తెలిపారు. గంగరాజు మాట్లాడుతూ సంఘసేవకుడు మరణించిన తర్వాత ఆయన నేత్రాలు దేహం దానం చేయడం వారి కుటుంబ సభ్యుల ఆలోచన విధానం ఎంతో ఉన్నతమైనదనే తెలిపారు. మెహర్ బాబా సుజాతమ్మ వందన సమర్పణ చేశారు.

## వైవియు గురుకులంలో డైనింగ్ హాల్ ప్రారంభం

### విద్యార్థినిల సౌకర్యార్థం ఏర్పాటు






**కడప పెన్ పవర్ జూలై 2 :** యోగివేమన విశ్వవిద్యాలయం గురు కులం విభాగంలో విద్యార్థినిల కోసం ప్రత్యేకంగా డైనింగ్ హాల్ ప్రారంభించి భోజన వసతి కల్పించారు. బుధవారం వై వి యు కుల సచివులు ఆచార్య పి పద్మ, ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ టి శ్రీనివాస్ విద్యార్థినిలకు భోజనం వడ్డించి డైనింగ్ హాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులంలో కామర్స్, ఎంబీఏ, ఎంసీఏ విభాగాల విద్యార్థులు మధ్యాహ్నం సమయంలో భోజనం కోసం కిలోమీటర్ దూరంలోని మెస్సులకు విశ్వవిద్యాలయ బస్సుల్లో రావాల్సి వచ్చేదని నేటితో ఆ సమస్య పరిష్కారం అయిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు విశ్వవిద్యాలయ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగ డీన్ ప్రొఫెసర్ వై సుబ్బరాయుడు, కామర్స్ విభాగ అధిపతి ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి, ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ పి సరిత, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, ఆచార్య విజయభారతి, డాక్టర్ రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ శిక్షణలో నల్లి పోసియ్య




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 2 :** గవర్నమెంట్ పోస్ట్ బేసిక్ ఉన్నత పాఠశాల స్కూల్లో స్కూల్ అసిస్టెంట్ నల్లి పోసియ్య ఉత్తరప్రదేశ్ నోయిడా లో జాతీయ నాణ్యత ప్రమాణాల ట్రైనింగ్ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 24,25 తేదీల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధిగా ఆయన హాజరయ్యారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత ప్రమాణాల సంస్థలో రెండు రోజుల పాటు జరిగిన శిక్షణలో పాల్గొన్నారు. పోసియ్య భారత్ ప్రమాణాల సంస్థ బి13 విజయవాడ బ్రాంచ్ ప్రతినిధులు నామినేట్ చేసి ఆయన్ను పంపారు. ఉపాధ్యాయుడు నల్లి పోసియ్య మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాల ద్వారా విజ్ఞాన శాస్త్రాన్ని అధ్యయనం చేసే పద్ధతులపై శిక్షణ ఇచ్చారని ఆయన అన్నారు. శిక్షణ అధికారులు చేత చిత్ర గుప్త, డాక్టర్ సూర్య కళ్యాణి నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకు న్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ముగించుకొని వచ్చిన ఉపాధ్యాయుడు నల్లి పోసియ్యను ఎంఈఓ 1 ఎం శ్రీనివాస్, ఎంఈఓ 2 టీవీ రామకృష్ణ, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఎన్.రాజేష్ స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కళింగ లక్ష్మణరావు తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# అభివృద్ధికి, సంక్షేమానికి సైకిలే బెస్ట్




**(3వ పేజీ తరువాయి)** సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. కుప్పం ప్రజలతోనూ.. అలాగే వివిధ పథకాల లబ్దిదారులను ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా కుప్పం అభివృద్ధి ప్రణాళికలను వివరించడంతోపాటు... రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చెప్పారు. ఇదే సందర్భంలో అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ... రాజకీయాలను నేరమయం చేసే కొన్ని పార్టీల కుట్రలను సీఎం వివరించారు.

**కుప్పంలోని చివరి ఎకరానికీ హంద్రీ-నీవా నీళ్లు**

కుప్పం అభివృద్ధికి బ్రహ్మాండమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు సీఎం వెల్లడించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మీ ముందుకు వచ్చా. దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేస్తాం. రూ.3,890 కోట్ల వ్యయం చేసి హంద్రినీవా పనులు పూర్తి చేస్తున్నాం. కుప్పంలో ఇప్పటికే హంద్రీ-నీవా కాల్వల లైనింగ్ పనులు జరుగుతున్నాయి. కుప్పం నియోజకవర్గంలో రూ.42.07 కోట్లతో 30.14 కిలో మీటర్ల మేర హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ పనులు పూర్తయ్యాయి. కుప్పంలో చివరి ఆయకట్టు వరకూ నీళ్లు తీసుకువస్తాం. ఈ ఏడాదిలోనే కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా నీళ్లు పారిస్తాం. అభివృద్ధి చేసే వారికి మాత్రమే సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ఉంటుంది. అప్పు చేసి సంక్షేమం చేస్తామనటం ఏం పరిపాలన..? అప్పు తెచ్చి అభివృద్ధి చేసి వచ్చిన ఆదాయాన్ని సంక్షేమానికి ఖర్చు చేయటమే నిజమైన ఆర్థిక వ్యవస్థ. గత ఏడాదిగా రాష్ట్రంలో ఈ విధానాన్నే అవలంబిస్తున్నాం. ప్రజలంతా ఆశీర్వదించబట్టే ఏడాదిగా సుపరిపాలనను రాష్ట్రంలో అందిస్తున్నాం. కుప్పంలో రూ.1292 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనుల్ని చేస్తున్నాం. ఇప్పటికే రూ.125 కోట్ల విలువైన పనులు కూడా పూర్తి అయ్యాయి. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా పనిచేసాం. గతంలో మహిళలు కట్టెల పొయ్యిపై వంట చేయకూడదని దీపం పథకం అమలు చేశాం. నాడు దీపంతో గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం.. నేడు దీపం-2.0తో ఉచిత సిలెండర్లు ఇస్తున్నాం. స్వర్ణ కుప్పం ప్రాజెక్టులో భాగంగా రహదారులను సీసీ, బీటీ రోడ్లుగా మారుస్తున్నాం. కుప్పం నియోజకవర్గంలో ప్రతీ ఇంటిలోనూ వంటగ్యాస్ ఉంది." అని చంద్రబాబు వెల్లడించారు.

**బ్రాండ్ కుప్పం**

"గతంలో బ్రాండ్ కుప్పం అనేది లేదు. ఇప్పుడు బ్రాండ్ కుప్పం పేరుతో ప్రమోట్ చేస్తాం. ఈ బ్రాండును మార్కెట్లులో ఎస్టాబ్లిష్ చేస్తాం. కుప్పంలో తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తాం. కుప్పంలో ఎయిర్ పోర్టు రాబోతోంది. రూ.850 కోట్లను కుప్పం విమానాశ్రయానికి ఖర్చు చేయబోతున్నాం. విమానాశ్రయానికి భూములివ్వొద్దని కొందరు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తారు. ఎయిర్ పోర్టుకు భూమి ఇచ్చిన వారికి మెరుగైన ప్యాకేజీ ఇస్తాం. అమరావతి రాజధానికి భూములిచ్చారు.. రాజధాని రైతులకూ ప్యాకేజీ ఇచ్చాం. కుప్పంలో ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానెల్ ఉండాలి. ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్ పెట్టుకునేంత వరకు నేను మీ వెంట పడతాను. ఇళ్లపై రూఫ్ టాప్ ఏర్పాటు ద్వారా మనమే సొంతగా విద్యుత్ తయారు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగానే పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నాం. బీసీలకు రాయితీ కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తాం. సూర్యఘర్ పథకాన్ని పూర్తిగా వినియోగించుకుంటే కరెంటు కోతల పరిస్థితి ఉండదు.. కరెంటు ఛార్జీలు కట్టే పరిస్థితి ఉండదు. కుప్పంలో ఏసీల అవసరం ఉండదు కానీ.. అవసరమైతే ఏసీలకు సోలార్ విద్యుత్ పెట్టుకోవచ్చు. ఇళ్లకే కాదు వ్యవసాయానికి సోలార్ విద్యుత్ వినియోగించుకోవాలి. వ్యవసాయ మోటార్లకు సోలార్ ప్యానెళ్లు బిగించుకోవచ్చు.. కేంద్ర ప్రభుత్వ పథకం కింద మోటార్లకు సోలార్ ప్యానెళ్లు బిగిస్తాం. కుప్పం రైల్వే స్టేషన్ ఆధునీకరిస్తాం, చెన్నైకి, బెంగళూరుకు వెళ్లే వారికి మరింత సౌకర్యంగా ఉంటుంది. పలమనేరు నుంచి కృష్ణగిరి రహదారికి 4 లేన్ల రహదారి వేస్తున్నాం. కుప్పం నుంచి హెూసూర్ వరకూ మరో సమాంతర రహదారి నిర్మిస్తాం. కృష్ణగిరి, బెంగళూరు, కోలార్, చెన్నైల మధ్య కుప్పం కేంద్రంగా మారుతుంది. బ్రహ్మాండమైన అభివృద్ధి కుప్పంలో జరగబోతోంది. కుప్పం రూపురేఖలు మార్చేందుకు ఓ అద్భుతమైన ప్రణాళిక తయారు చేశాం." అని చంద్రబాబు వివరించారు.

**ఆరోగ్యం, ఆదాయం, అభివృద్ధి**

"కుప్పం ప్రజల ఆరోగ్యం బాగుండాలి. ఆదాయం పెరగాలి. అభివృద్ధి చెందాలి. ఈ దిశగానే స్వర్ణ కుప్పం-2029 విజన్ సిద్ధం చేశాం. అన్ని రంగాల్లోనూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి.. దేశానికే కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా. కుప్పంలో ఆలయాల అభివృద్ధి కోసం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేశాం. నియోజకవర్గంలో అన్ని ఆలయాలను పునరుద్ధరించేందుకు ప్రణాళిక చేస్తున్నాం. గోకులం షెడ్లు కూడా పెద్ద ఎత్తున కట్టించాం. నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికీ ఆవులను ఇచ్చాం. అదే ఇప్పుడు ప్రతి ఇంటికీ ఆదాయాన్ని సమకూరుస్తోంది. వచ్చే రోజుల్లో కుప్పంలో 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి అవుతుంది. నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం బాగుండాలి. 130 ఇ-ఆటోలతో చెత్త సేకరణ చేస్తున్నాం. ఎలక్ట్రిక్ ఆటోలతో తడి చెత్త, పొడి చెత్త సేకరిస్తున్న తొలి నియోజకవర్గంగా కుప్పం మారింది. పర్యాటక కేంద్రంగానూ కుప్పాన్ని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేస్తున్నాం. హార్టీ కల్చర్ హబ్ రాయలసీమ అయితే దానికి దిక్సూచిగా కుప్పం మారుతుంది. వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని కుప్పం యువతకు ఉపాధి కల్పిస్తున్నాం. బిల్ గేట్స్ ఫౌండేషన్ - టాటాతో కలిసి డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నాం. పైలట్ ప్రాజెక్టుగా కుప్పం నుంచే దీన్ని అమలు చేస్తున్నాం. కుప్పం నియోజకవర్గం కోసం జన నాయకుడు పోర్టల్ ద్వారా నియోజకవర్గంలో సమస్యలు, అర్జీలకు పరిష్కారం చేస్తున్నాం. 10,393 మంది బంగారు కుటుంబాలు కుప్పంలో ఉన్నాయి. వీరందరికీ మార్గదర్శులను అనుసంధానం చేస్తాం." అని కుప్పం అభివృద్ధి ప్రణాళికలను సీఎం వివరించారు.

**పేదల కోసం అభివృద్ధి యజ్ఞం**

"సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమానంగా చేస్తున్నాం. వచ్చిన ఆదాయం పేదవారికి కేటాయించాలి, అదే సమయంలో అభివృద్ధి కూడా చేయాలి. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసాన్ని తలచుకుంటేనే భయం వేస్తోంది. రూ.10 లక్షల కోట్ల అప్పులు, అసలూ, వడ్డీలు కలిపి కట్టాలి. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలూ పడకేసేలా గత ప్రభుత్వం వ్యవహరించింది. కేంద్రం ఇచ్చిన డబ్బుల్ని కూడా వేరే వాటికి ఖర్చు పెట్టేసి వివిధ పథకాలను



అస్తవ్యస్థం చేసింది. ప్రజల్ని కష్టపెట్టకూడదన్న లక్ష్యంతోనే సంక్షేమ కార్యక్రమాల్ని కొనసాగిస్తున్నాం. కొవ్వూరు నియోజకవర్గంలో ఓ చర్మకారుడ్ని పలకరించి, డప్పు కళాకారులకిచ్చే పెన్షన్ ఇచ్చాను.. ఇది నాకు చాలా ఆనందాన్ని కలిగించింది. ఏ రాష్ట్రమూ ఏపీ ఇస్తున్నంత పెన్షన్ను ఇవ్వడం లేదు. కుప్పం పక్కనే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయి.. అక్కడా ఇలా పెన్షన్లు ఇవ్వడం లేదు. దివ్యాంగులకు 12 రెట్ల మేర పెంచి పెన్షన్ ఇస్తున్నాం. కిడ్నీ లాంటి వ్యాధిగ్రస్తులకు కూడా ప్రభుత్వం సాయం చేస్తోంది. మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నాం. మీ ఇంటికి పెద్దకొడుకు తరహాలో సేవచేస్తున్నా. కష్టాల్లో ఉన్న ప్రజల్ని ఆదుకోవటం కూటమి ప్రభుత్వ బాధ్యత. ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం పథకం అమలు చేశాం. ఐదుగురు పిల్లలు ఉంటే ఒకేసారి రూ.75 వేలు చెల్లించాం. భవిష్యత్తులో కూడా ఈ పథకాన్ని అమలు చేస్తూనే ఉంటాం. రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు చెల్లిస్తాం. గత ప్రభుత్వం రూ.7500 మాత్రమే ఇచ్చింది. గత ప్రభుత్వానికంటే.. డబుల్ సంక్షేమం చేస్తున్నాం. దీపం కింద గ్యాస్ పథకం, పెంచిన పెన్షన్ల కింద పేద, మధ్య తరగతి వారిని ఆదుకుంటున్నాం. ఏ నాయకుడు ప్రజలకు అండగా నిలుస్తారు, జీవితాల్లో వెలుగులు నింపుతారో వారినే ఆదరించాలి. 3775 పెన్షన్లు కుప్పంలో అదనంగా ఇస్తున్నాం. రాష్ట్రంలో అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించాం. వాట్సప్ గవర్నెన్సు ద్వారా పౌర సేవలు అందుతున్నాయి. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లకుండానే పౌరసేవలు అందేలా వాట్సప్ గవర్నెన్సును రూపొందించాం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సమస్య పరిష్కారం లభించేలా కార్యాచరణ చేపడుతున్నాం. ఆగస్టు 15లోగా 15 లక్షల బంగారు కుటుంబాలకు లక్షల మంది మార్గదర్శకులను సిద్ధం చేస్తాం. 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రాన్ని తయారు చేస్తాం." అని చంద్రబాబు చెప్పారు.

**సైకిల్ ఈజ్ ది బెస్ట్**

"కుప్పంలో 400 మంది డ్వాక్రా మహిళలకు ఇ-సైకిళ్లను అందిస్తున్నాం. ఎక్కువ శ్రమ లేకుండా సైకిల్ తొక్కవచ్చు.. వ్యాయామం కోసం కూడా సైకిల్ తొక్కాలి. అందుకే సైకిల్ ఈజ్ ది బెస్ట్, సైకిల్ తొక్కితే ఆరోగ్యం, ఆనందం, సైకిలే శాశ్వతం. గత ప్రభుత్వ హయాంలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. 22ఏ భూముల్ని ఇష్టానుసారంగా అమ్మేశారు. రాష్ట్రంలో భూ వివాదాలు లేకుండా, ఆక్రమణలు లేకుండా కాపాడే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. గతంలో క్వార్టర్ బాటిల్ తాగి నానా యాగీ చేశారు. అఘాయిత్యాలు చేశారు. రౌడీయిజం చేస్తే ఆటలు సాగనివ్వను. ప్రస్తుతం ఉన్నది సీబీఎన్-2014 కాదు.. సీబీఎన్-1995. 9 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నాపై ఎప్పుడైనా నేరారోపణలు ఉన్నాయా..? ఇప్పుడు కొందరు రాజకీయాలను నేరమయం చేస్తున్నారు. బాబాయిని చంపి.. నాపై నేరం మోపారు. కారు కింద వారి కార్యకర్తల్నే తొక్కించి.. కుక్కపిల్లలా రోడ్డు పక్కన పడేశారు. ఇప్పుడు వారి కార్యకర్త మరణానికి కారణం ప్రభుత్వమేనంటున్నారు. కోడికత్తి, గులకరాయి లాంటి డ్రామాలాడి నాపైనే నెపం పెట్టారు. హత్యా రాజకీయాలు, శవ రాజకీయాలు చేయను.. నాకు తెలిసింది ప్రజాహిత రాజకీయాలు మాత్రమే. రాక్షసులపై యుద్ధం చేస్తున్నా.. అభివృద్ధి, సంక్షేమ కోసం యజ్ఞం చేస్తున్నా.. యజ్ఞ ఫలితాలను ప్రజలకు అందిస్తాను. తప్పు చేసే వ్యక్తుల్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. కులాలు మతాలు కాదు కావాల్సింది అభివృద్దే. తద్వారా నియోజకవర్గం అభివృద్ధి జరగాలన్నదే నా ఆకాంక్ష. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి.. అందుకే నెల రోజుల పాటు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపడుతున్నాం. పార్టీ అధ్యక్షుడిగా పార్టీలో కార్యకర్తలను, సీఎంగా కలెక్టర్ నుంచి క్షేత్రస్థాయిలో ఉద్యోగి వరకూ అందరినీ సమన్వయంతో పనిచేయించి పొలిటికల్ గవర్నెన్సు చేస్తున్నాం. పీ4 ద్వారా పేదలను ఆదుకునేలా బంగారు కుటుంబాలను- మార్గదర్శుల ద్వారా కార్యక్రమం అమలు చేస్తున్నాం." అని చంద్రబాబు చెప్పారు. కుప్పంలో కొత్తగా ఎంపికైన పెన్షన్ లబ్దిదారులకు పెన్షన్లను సీఎం అందచేశారు. అలాగే దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. దీపం-2.0 పథకం కింద కొత్తగా వేయి మందికి గ్యాస్ కనెక్షన్లు అందచేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా కుప్పం వచ్చిన ముఖ్యమంత్రికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సహా చిత్తూరు, కుప్పం స్థానిక నేతలు, జిల్లా కలెకర్ట్, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.

## తిరుమలలో ఆర్టీవో అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్




**తిరుమల పెన్ పవర్ జూలై 2 :** ఈరోజు తిరుమలలో తిరుమల ట్రాఫిక్ పోలీసులు మరియు తిరుపతి ఆర్టీవో అధికారులు కలిసి టోల్గేట్ వద్ద మోటర్ వాహన నిబంధనలను పాటించని రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ల పైన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 45 వాహనాలు తనిఖీ చేసి అందులో 22 వాహనాలకు 1,31 220 రూపాయలు జరిమానా విధించడం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు, నిబంధనలకు లోబడి ఉండాలని రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలియజేశారు. ఈకార్య క్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, మోహన్ కుమార్, వెంకటరమణ నాయక్ మరియు ట్రాఫిక్ సిఐ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

## కుప్పం రూపురేఖలే మారుస్తాం

**(3వ పేజీ తరువాయి)** వేస్తున్నామని, కుప్పం నుంచి హెూసూర్ వరకూ మరో సమాంతర రహదారి నిర్మిస్తామన్నారు. కృష్ణగిరి, బెంగళూరు, కోలార్ ,చెన్నై లకూ మధ్య కేంద్రంగా కుప్పం మారుతుందని, బ్రహ్మాండమైన అభివృద్ధి కుప్పంలో జరుగుతుందని, కుప్పం రూపురేఖలు మార్చేందుకు ఓ అద్భుతమైన ప్రణాళిక తయారు చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి తెలిపారు.

## అరటి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన





**(3వ పేజీ తరువాయి)** అంశాలపై అధ్యయనం చేసి వాటి స్థితిగతులను నివేదిక రూపంలో తనకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అరటి టిష్యూ కల్చర్ కేంద్రం ఏర్పాటు అయితే ముఖ్యమైన ఆహార పంటగా మెరుగైన కణజాల కల్చర్ అరటి ఉత్పత్తితోపాటు రైతులకు నాణ్యమైన పరిశో దాత్మకమైన పంట మొక్కను అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా అరటి ఉత్పత్తిని పేద, ధనిక తేడా లేకుండా ప్రజలందరికీ అందుబాటులో అరటి కణజాల సంస్కృతి సౌకర్యం కల్పించినట్లు.ఉంటుందన్నారు.అనంతరం ఊరి చింతల వద్ద ఇటీవల మంజూరు కాబడిన ఎం ఎస్ ఎం ఈ పార్క్ స్థలాన్ని కూడా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించి త్వరలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాడిపత్రి తాసిల్దార్ సోమశేఖర్, మండల సర్వేయర్ రామ్మోహన్, పలువురు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో కొత్త జోష్

### ప్రముఖ న్యాయవాదుల చేరికతో ఉత్సాహం

### నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు





**ధర్మవరం, జూలై 2 :** ధర్మవరం పట్టణం 9వ వార్డుకు చెందిన ప్రముఖ న్యాయవాదులు రామానాయుడు, రంజిత్ గార్లు బుధవారం వారి అనుచర వర్గంతో కలిసి భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ధర్మవరం మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు పార్టీ కండువా కప్పి వీరిని ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ బలమైన నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇంత సమగ్ర అభివృద్ధిని చూచి ఆకర్షితులైన రామానాయుడు, రంజిత్ గార్లు బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు, ధర్మవరం పట్టణంలోని బీసీ విద్యార్థుల కోసం ప్రీ-మెట్రిక్ హాస్టల్‌ను మంత్రి సత్య కుమార్ చొరవతో మంజూరు చేయించారని, పట్టణానికి దూరంగా ఉన్న గ్రామాల విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగపడనుందని హరీష్ బాబు వివరించారు. అదేవిధంగా, బత్తలపల్లి మండలంలో వ్యవసాయరంగ అభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రం (%ఖఎఖ%) ఏర్పాటు కోసం భూముల పరిశీలన పూర్తయ్యిందని, రైతులకు శాస్త్రీయ పద్ధతులు అందించేందుకు ఇది ఎంతో ఉపయోగపడనుందని చెప్పారు. ధర్మవరం హస్తకళల అభివృద్ధికి దోహదపడే విధంగా,కింద ముడి పదార్థాల డిపో ఏర్పాటుకు కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మే 13, 2025న అధికారికంగా ఉత్తరం రాశారని, దానిని సంబంధిత శాఖలకు చర్యలు తీసుకునేలా పంపినట్లు హరీష్ బాబు వెల్లడించారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రోత్సహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక పాలన ప్రజల్లో విశ్వాసం పెంచుతున్నాయని, త్వరలో మరెంతోమంది నాయకులు, ప్రజా ప్రతినిధులు బీజేపీలో చేరబోతున్నారని హరీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాల అధ్యక్షులు, బిజెపి సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కడపలో ఇంటింటా సుపరిపాలన తొలి అడుగు

### ఎమ్మెల్యే మాధవి రెడ్డి



**కడప పెన్ పవర్ జూలై 2 :** సుపరిపాలన తొలి అడుగు ఇంటింట విజయ యాత్రలో భాగంగా కడప నగరం నందు పదవ డివిజన్లో గౌరవ కడప శాసనసభ సభ్యులు ప్రభుత్వ విప్ రెడ్డప్ప గారి మాధవి రెడ్డి గారు ఇంటింటా సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రభుత్వ ఫలాలు అందరూ పొందుకోవాలని సూచిస్తు, ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగుతున్న కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి.

# కన్నులపండుగగా పుష్పయాగం



**తిరుపతి పెన్ పవర్ జూలై 2 :** తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో బుధవారం పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 9.30 – 11.30 గం.ల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. అనంతరం మధ్యాహ్నం 1 నుండి సాయంత్రం 4 గంటల వరకు అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం వైభవంగా జరిగింది. గత బ్రహ్మోత్సవాల్లో గానీ, నిత్యకైంకర్యాల్లో గానీ అర్చక పరిచారకులు, అధికారులు, అనధికారులు, భక్తుల వల్ల తెలిసీ తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు వంటి 12 రకాల సాంప్రదాయ పుష్పాలు, తులసి, మరువం, దమనం, బిల్వం, పన్నీరాకు వంటి 6 రకాల పత్రాలు కలిపి మొత్తం 3 టన్నుల పుష్పాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. ఈ పుష్పాలను ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాతలు విరాళంగా అందించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డెప్యూటీ ఈవో శాంతి, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసులు, ఏఈవో



గోపీనాథ్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామ రాజు 128వ జయంతి వేడుకలు

**తిరుపతి పెన్ పవర్ జూలై 2 :** జూలై 04న అల్లూరి సీతారామ రాజు 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు టిటిడి ఏర్పాట్లు చేపట్టింది. అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10.30 గం.లకు ఈ వేడుకలను టిటిడి వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నిర్వహించనుంది. ఈ సందర్భంగా స్వాగతోపన్యాసం, ప్రార్ధన, పూజ, జ్యోతి ప్రజ్వలన, వక్తల ఉపన్యాసం, అతిథులకు సన్మానం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ ఏర్పాట్లను టిటిడి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సంక్షేమం) ఎ.ఆనందబాబు పర్యవేక్షిస్తున్నారు.

## అమరావతి నిర్మాణానికి సీఎం కు లక్ష రూపాయల చెక్కును అందజేసిన నామా కొండబాబు



**తాళ్ళపూడి, పెన్ పవర్, జూలై 2 :** పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తాళ్ళపూడి మండలంలోని మలకపల్లి గ్రామానికి మంగళవారం విచ్చేసారు. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణంలో భాగంగా తన వంతు సాయంగా తాడిపూడి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నామా వెంకట సుబ్బారావు(కొండబాబు) ఉదారత చాటుకున్నారు. తన సొంత నిధులనుండి లక్ష రూపాయల చెక్కును కొండబాబు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సమక్షంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కొండబాబును ముఖ్యమంత్రి అభినందించారు.

## విజయ భారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ హాస్పిటల్ లో ఘనంగా "జాతీయ డాక్టర్స్ డే" సెలెబ్రేషన్స్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జూలై 2 :** దివాన్ చెరువు వద్ద ఉన్న విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ హాస్పిటల్ లో మంగళవారం జాతీయ డాక్టర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ప్రఖ్యాత వైద్య నిపుణులు, విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ అధినేత డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కు ఈ సందర్భంగా పలువురు వైద్యులు, వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది, హాస్పిటల్ సిబ్బంది, అభిమానులు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ యాజమాన్యం, సిఇఒ గూడూరి రాధికా విజయవాడ భారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ డాక్టర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ప్రధాన వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హితేష్ చరణ్, డాక్టర్ గూడూరి భరత్ బాబు, డాక్టర్ రాజశేఖర్ లకు వైద్యులు, సిబ్బంది, సిస్టర్స్ పుష్ప గుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి వేడుకగా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రఖ్యాత వైద్య నిపుణులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్స్ మంచి నడవడితో మానవతా దృక్పదంతో రోగులను ట్రీట్ చేయాలని సూచించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారిపట్ల ఆప్యాయతగా వుండాలన్నారు. ఈ వేడుకల్లో పరమేశ్వరి, స్థాఫ్ నర్స్ సూర్య, మానస, డాక్టర్స్ రమ్య, వినీత, శ్రావణి, గాయత్రి, నాని, విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ మేనేజర్ అయ్యప్ప మణికంఠధర్, సిఓఓ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణతోనే డెంగ్యూ నిర్మూలన




**సీతానగరం, పెన్ పవర్, జూలై 02 :** సీతానగరం మండలంలోని చిన కొండేపూడి గ్రామపంచాయతీ కార్యాలయంలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సి.హె.చ్ సి సిబ్బంది మరియు ప్రజలతో కలిసి జాతీయ డెంగ్యూ మహోత్సవం సందర్భంగా డెంగ్యూ వ్యాధి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా డాక్టర్ ఏవీకే చైతన్య మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఈండీస్ అనే దోమ కుట్టడం ద్వారా వస్తుందని ఈ వ్యాధిని అశ్రద్ధ చేస్తే రక్తంలో పేట్లెట్స్ కణాలు సంఖ్య తగ్గిపోయి ప్రాణాపాయం సంభవించవచ్చని అన్నారు, దోమల వృద్ధికి కారణమయ్యే ఇంటి లోపల బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని, పాత టైర్లు కొబ్బరి డొక్కులు లేకుండా చూసుకోవాలని నీటి కుండీలు పూల కుండీలలో మూడు రోజులు మించి నిలవ లేకుండా చూడాలని ఇంటి పరిసరాలలోనూ జనవాసాలకు దగ్గర్లోను నీటి కుండీలు లేకుండా చూసుకోవాలని దోమతెరలు వాడాలని ప్రతి శుక్రవారం డెడే పాటించాలని కొద్దిపాటి జ్వరం వచ్చిన అశ్రద్ధ చేయకుండా వెంటనే కార్యకర్తను సంప్రదించి ఆమె సహాయంతో మీ ఊరిలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అక్కడ ఉన్న ఎమ్ ఎల్ హెచ్ పి ద్వారా రక్త పరీక్షలు మందులు తీసుకోవాలని ఈ జూలై నెల అంతా వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి గ్రామాల్లోనూ డెంగ్యూ వ్యాధి నిర్మూలన గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో చిన్న కొండెపూడి గ్రామపంచాయతీ కార్యదర్శి ఎమ్ ప్రకాష్ బాబు, ఎం పి హెచ్ ఓ వై ఎస్ రాయుడు పాల్గొన్నారు.

## విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే





**మఠం, పెన్ పవర్ జూలై 2 :** బి.మఠం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలురు) తరగతి గదుల ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీఈజి అశోక్ కుమార్,మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్.. సహపంక్తి భోజనం చేస్తూ విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. గురుకుల పాఠశాలలో సరైన సమయానికి టిఫిన్, భోజనం అందజేస్తున్నారా? రుచిగా అందిస్తున్నారా? వారానికి రెండుసార్లు ఇచ్చే చికెన్ తగినంతగా ఇస్తున్నారా లేదా? వసతి గృహంలో బెడ్ షీట్స్ అందించారా లేదా అనే విద్యార్థులను కలెక్టర్ అడగగా విద్యార్థులు మేము అడిగినంతా అన్నం పెడతారని, కూరలు రుచికరంగా ఉంటాయని, బెడ్ షీట్స్ అందించారని ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీరేష్ అనే విద్యార్థి కలెక్టర్ తో మాట్లాడుతూ మాది కర్నూలు జిల్లా కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామమని మా తల్లిదండ్రులు ఇటుక పనికి వెళ్తారని,తాను 9వ తరగతి చదువు తున్నానని, పెద్దయ్యాక మాథ్స్ టీచర్ అవుతానని కలెక్టర్ కి తెలుపగా కలెక్టర్ సంతోషం వ్యక్తం చేస్తూ బాగా చదువుకొని నువ్వు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు.

## బాలల రక్షణలో భాగస్వాముల పాత్రపై అవగాహన వర్క్‌షాప్



**కడప పెన్ పవర్ జూలై 2 :** తహసీల్దార్లు, ఎంపీడీఓలు, బాల సంక్షేమ పోలీసు అధికారులు, మండల విద్యాధికారుల పాత్రపై చర్చ. వైఎస్ఆర్ జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాట్సల్యా పథకంలో భాగంగా, బాలల రక్షణలో కీలకంగా వ్యవహరించే అధికారులైన తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారీలు, బాల సంక్షేమ పోలీస్ అధికారులు, మండల విద్యా అధికారులు పాత్రపై విశేష అవగాహన వర్క్‌షాప్ ఈరోజు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించబడింది. ఈ వర్క్‌షాప్‌ను జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీమతి డి.శ్రీలక్ష్మి గారు ప్రారంభించి, బాలల రక్షణలో ప్రతి విభాగం సమన్వయం అవసరమని పేర్కొన్నారు. పిల్లలకు సంబంధించిన కేసుల్లో వీరందరి పాత్ర ఎంతో కీలకమని, JJ చట్టం – 2015, POCSO చట్టం – 2012, బాలల వివాహ నిషేధ చట్టం వంటి చట్టాల అమలులో ఈ అధికారుల బాధ్యతలు స్పష్టంగా ఉండాలని అన్నారు.

వర్క్‌షాప్‌లో ముఖ్యాంశాలు:

పిల్లలకు మానవీయ దృక్పథంతో సేవలు అందించడం

బాలల వివాహాల నిరోధంలో తహసీల్దార్ల సహకారం

సంక్షేమ పథకాల అమలులో MPDOల పాత్ర

బాలలపై నేరాల విచారణలో CWPOల బాధ్యతలు

స్కూళ్లలో బాలల రక్షణపై MEOల పాత్ర, అవగాహన కార్యక్రమాలు.. తదనంతరం వర్క్ షాప్ నందు పాల్గొన్న అధికారులు అందరికీ మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ



మరియు సాధికారిత అధికారినీ డి .శ్రీలక్ష్మి గారు సర్టిఫికెట్స్ ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ అధికారులు, సమాజ సంక్షేమ శాఖ ప్రతినిధులు, బాలల హక్కుల పరిరక్షణలో పని చేసే స్వచ్ఛంద సంస్థలు, మరియు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. చివరగా, అన్ని విభాగాల సమన్వయంతోనే బాలల రక్షణ సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## జిల్లాలో ఏర్పాటు చేసే వివిధ ప్రగతి పనులకు మరియు పరిశ్రమల కు భూ సేకరణ వేగవంతంగా పూర్తి చేయాలి

### పిజిఆర్ఎస్ అర్జీలను సంభందిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



**అనంతపురం, పెన్ పవర్ జూలై 02 :** జిల్లాలో ఏర్పాటు చేసి వివిధ రకాల ప్రగతి పనులకు మరియు పరిశ్రమలకు అవసరమగు భూ సేకరణ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ సెక్టార్, పి జి ఆర్ ఎస్,ఈ సర్వే,ఆధార్ సీడింగ్,ఆడంగల్ కరప్షన్,ఆర్ ఓ ఆర్,వెబ్ ల్యాండ్, తదితర అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, నియోజకవర్గ, మండల సర్వేయర్లు, తదితరులతో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసి వివిధ రకాల పరిశ్రమలకు మరియు వివిధ ప్రగతి పనులకు ప్రాధాన్యత ప్రకారం భూకేటాయింపు, భూ సేకరణ వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎనర్జీ శాఖ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులు, రెనెవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు, ఇతర ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ త్వరితగతిన చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కవ పరిశ్రమలు ఏర్పాటు అయితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని,తలసరి ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. రీసర్వేకి సంబంధించి మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్లను పూర్తిగా ఉపయోగించుకోవాలని, మండల తహసీల్దారులు వారితో పనులు చేయిం చాలని, పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) అర్జీలను సంబంధిత మండల తహసీల్దారులు, సంబంధిత శాఖల అధికారులు ప్రతి ఒక్కరు క్షేత్రస్థాయికి వెళ్లాలి పరిశీలించినట్లు క్షేత్రస్థాయికి వెళ్లినట్లు ఆధారాలు ఉండాలన్నారు.

సర్వే ఏడి, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల సర్వేయర్లు గ్రామాలకు వెళ్లి పీజిఆర్ఎస్ లో ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి అందుకు సంబంధించిన ఆధారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో అర్జీదారుల అందజేసిన అర్జీలకు సంబంధించి పెండింగ్ గ్రీవెన్స్ ని గడువు లోగా పరిష్కరించాలని సంబందించిన అధికారులను ఆదేశించారు. నాణ్యతతో రీ సర్వే పనులను వేగవంతం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ ఏ.మలోల, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు యుగేశ్వరి దేవి, రియాజుద్దీన్, పీజిఆర్ఎస్ తహసిల్దార్ వాణిశ్రీ, తహసీల్దార్లు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, తదితరులు పాల్గొన్నారు.



## భక్తుల సేవలకు ఆటంకం కల్గిస్తే చర్యలు తప్పవు - టిటిడి



**తిరుపతి పెన్ పవర్ జూలై 2 :** టిటిడితో సంబంధంలేని బయట వ్యక్తులు సేవలకు ఆటంకం కలిగిస్తే క్రిమినల్ చర్యలు ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు టిటిడి సంసిద్ధం శ్రీవారి భక్తులకు సేవలు అందించే కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులను బహిష్కరించి నిరసనలకు దిగితే చర్యలు తప్పవని టిటిడి పేర్కొంది. కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ న్యాయమైన కోరికలను సదరు శాఖాధిపతులతో చర్చించి పరిష్కరించుకోవాలని కోరింది. న్యాయమైన కోర్కెలను తీర్చడానికి యాజమాన్యం సదా సంసిద్ధంగా ఉందని పేర్కొంది. పారిశుద్ధ్యం, ఆరోగ్యం తదితర శాఖలలో సంబంధిత కాంట్రాక్ట్ ఉద్యోగులు విశేషంగా సేవలు అందిస్తున్నారని, భక్తులకు ఇబ్బందులు గురిచేసే చర్యలు తీసుకోవద్దని కోరింది. భక్తుల సేవలకు ఉద్యోగులు ఆటంకం కల్గించే చర్యలను నిషేధించే ముఖ్యమైన సేవల నిర్వహణ చట్టం ( ఎస్మా ) టిటిడిలో అమలులో ఉందని, సదరు నిబంధనలను ఉద్యోగులు గుర్తు చేసుకోవాలని టిటిడి పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న ఆధ్యాత్మిక సంస్థలో విధులను బహిష్కరించడం సరికాదని సూచించింది. నిబంధనలను ఉల్లంఘించి సమ్మెబాట పడితే ఎస్మా చట్టాన్ని అమలు చేస్తామన్నారు. ఎస్.ఎల్.ఎస్.ఎం.పీ.సీ సంస్థతోపాటు కాంట్రాక్ట్, పలు సొసైటీలలో ఉద్యోగులు పనిచేస్తున్నారని, సదరు ఉద్యోగులు విధులను బహిష్కరిస్తే ఎస్మా చట్టం ప్రకారం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గతంలో టిటిడిలో విధులను బహిష్కరణ చేసినా మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవడం జరిగింది. ఈసారి విధుల నుండి తొలగించాక విధులను బహిష్కరించిన వారిని ఎలాంటి పరిస్థితుల్లో తిరిగి చేర్చుకోరని టిటిడి తెలిపింది. టిటిడిలో భక్తులకు సేవలు అందించే ఉద్యోగులు ధర్నాలు చేయడం, నిరసన నోటీసులు ఇవ్వడం, ఊరేగింపులు చేయడం చట్టప్రకారం నిషేధం. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా, ఉద్యోగుల విధులకు టిటిడితో సంబంధం లేని బయట వ్యక్తులు ఆటంకం కల్గిస్తే చట్టపరమైన క్రిమినల్ చర్యలకు వెనుకాడమని హెచ్చరించింది. రోగుల వైద్య సేవలను బహిష్కరిస్తే చర్యలు తప్పవు– స్విమ్స్ డైరెక్టర్ శ్రీ ఆర్వీ కుమార్ స్విమ్స్ లో విధులు నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మి శ్రీనివాస కార్పొరేషన్ లోని కాంట్రాక్ట్ ఉద్యోగులు గత కొంత కాలంగా పలు రకాల కోరికలను కోరుతూ విధులను బహిష్కరించేందుకు సిద్ధపడుతున్నారని , టిటిడి యాజమాన్యం చాలా సామరస్యంగా పరిష్కరించాలని ఉందన్నారు. సదరు ఉద్యోగులు సంబంధిత శాఖాధిపతులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. స్విమ్స్ లో ఎస్మా చట్టం అమలులో ఉన్నందున సమ్మె నోటిస్ ఇవ్వడం చట్టవిరుద్ధమన్నారు. వైద్య సేవలకు ఆటంకం కల్గిస్తే విధుల నుండి తొలగించే నిబంధన ఉందని, తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. విధులను బహిష్కరించి సమ్మెకు దిగితే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. స్విమ్స్ తో సంబంధం లేని బయట వ్యక్తుల ప్రమేయంతో నిరసనలకు దిగితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. విధులను బహిష్కరించినందుకుగాను, ఒకసారి ఉద్యోగం తొలగించాక, సదరు ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోరనే విషయాన్ని గమనించాలని స్విమ్స్ డైరెక్టర్ ఉద్యోగులను కోరారు.

## పాఠశాల నిబంధనలు ఉల్లంఘిస్తే.. చర్యలు తప్పవు..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప, పెన్ పవర్ జూలై 2 :** విద్యాలయాల విలువలను దిగజార్చేలా ప్రబవర్తించినా, పాఠశాల నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పవని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం వనిపెంటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను మైదుకురు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ లతో కలిసి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. పేద విద్యార్థులకు అధునాతన వసతులతో నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో.. వనిపెంటలో నిర్వహణలో ఉన్న మహాత్మా జ్యోతీరావు పూలే బాలికల బీసీ గురుకుల విద్యాలయంలో కొన్ని సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే.. కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో.. బి.మఠం పర్యటన తిరుగు ప్రయాణంలో ఆ పాఠశాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల సమస్యలపై ప్రిన్సిపాల్ నిర్మలతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. పాఠశాల మొత్తం విద్యార్థుల సంఖ్య, ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య, సిబ్బంది సంఖ్య తదితర విషయాలపై మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా వుండడంపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పాఠశాల పునఃప్రారంభం అయ్యి 20 రోజులు దాటినా విద్యార్థులు తిరిగి రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వచ్చే సోమవారం నాటికి పాఠశాల రిజిస్టర్ లో ఉన్న విద్యార్థులందరూ హాజరవ్వాలని సూచించారు. లేని పక్షంలో పాఠశాల నుండి పేర్లు తొలగించడం జరుగుతుందన్నాను. అలాగే.. పాఠశాల నిబంధనలను ఉల్లంఘించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. మంగళవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో.. తొండూరు మండలంలోని మల్లెల గ్రామంలో నూతనంగా ఏర్పాటైన మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల విద్యాలయంలో పెండింగ్ పనులు, వసతులు సంబందిత అంశాలపై సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల పాఠశాల, జూ.కళాశాల వెనుకబడిన తరగతులు, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించనుందన్నారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న విద్యాలయాన్ని త్వరలో నూతన భవనంలో సదుపాయాలు సిద్ధం చేసి షిఫ్ట్ చేయడం జరుగుతోందన్నారు. రెండు నెలల గడువులోగా గురుకులంలో ఎలాంటి మౌళిక సదుపాయాల కొరత లేకుండా.. రోడ్లు, విద్యుత్, నీటి పైప్ లైన్, గ్రీనరీ, డ్రిప్ ఇరిగేషన్ తదితర అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చాలన్నారు. అన్ని విభాగాల భవనాల నిర్మాణం ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందని.. ఇంకనూ పెండింగ్ లో ఉన్న ఫర్నిచర్, కిచెన్ సామగ్రి, కంప్యూటర్స్ తదితర వస్తువులను నిర్ణీత గడువులోగా సిద్దం చేయాలని సంబందిత అధికారులను అదేశించారు. పాఠశాల విషయాల్లో స్థానిక రాజకీయ జోక్యాలను సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, బీసీ వెల్ఫేర్ అధికారులు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది సద్వినియోగం చేసుకోండి




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 2 :** రైతులకు సాగులో మెళకువలు తెలియజేస్తూ విత్తన మార్పిడి ప్రభుత్వ పథకాలు తెలియపరిచే విధంగా నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు గంగాధర్ సూచించారు. తాడేపల్లిగూడెం మండలం చిన్న తాడేపల్లి , కొండ్రుప్రోలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి నారాయణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతి థిగా పాల్గొన్న తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు పరిమి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అందిస్తోందని తెలిపారు. ముఖ్యంగా గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన సబ్సిడీపై యంత్రాల అందజేత కార్యక్రమాన్ని పునరుద్ధరిం చామన్నారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికా రెడ్డి విద్యాసాగర్, కార్యదర్శి రమేష్, రైతులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు వరం.. మహా గురుకులం..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. మైదుకురు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఎస్పీ అశోక్ కుమార్ లతోకలిసి డా. బి.ఆర్. అంబేద్కర్ (బాలుర) మహా గురుకుల విద్యాలయంలో తరగతుల ప్రారంభోత్సవం



**కడప, పెన్ పవర్ జూలై 2 :** నాణ్యమైన విద్య, అధునాతన వసతులతో రూపుదిద్దుకున్న డా. బి.ఆర్. అంబేద్కర్ (బాలుర) మహా గురుకులం విద్యాలయం.. పేద విద్యార్థుల పాలిట వరం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అభివర్ణించారు. బుధవారం బి.మఠం మండలంలో నూతనంగా ఏర్పాటైన డా.బి.ఆర్.అంబేద్కర్ మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో ఆకాడమిక్ భవనాల్లో తరగతులు, వసతి గృహ భవనాల జిల్లా కలెక్టర్ డి.. శ్రీధర్ చెరుకూరి, మైదుకురు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ లతో కలిసి ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... బి.మఠం మండల కేంద్రానికి సమీపంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న డా. బి.ఆర్. అంబేద్కర్ మహా గురుకులం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు వచ్చిందన్నారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు విద్యా వసతులు కల్పించగల సామర్థ్యం ఉన్న ఈ బాలుర మహా గురుకులంలో.. ఈ విద్యా సంవత్సరానికి గాను 640 మంది విద్యార్థులతో అడ్మిషన్లను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆధునాథన మైన సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందించే మహా గురుకులంలో.. చేరేందుకు అర్హులైయిన పేద విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈరోజు భారత దేశం ఆర్థిక అభివృద్ధిలో 4వ స్థానంలో నిలుచుం దంటే.. అందుకు కారణం మన విద్య వ్యవస్థపై మన ప్రభుత్వాలు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ వల్లనే అన్నారు. మన పూర్వీక మహా ఋషులు అవలంభించిన ఒక విలువలతో కూడిన విద్య వ్యవస్థ మన దేశంలో ఇప్పటికీ కొనసాగుతోందని.. అలాంటి విద్యా వ్యవస్థే.. ఈ గురుకుల విద్యాలయ వ్యవస్థ అన్నారు. సమాజంలో పిల్లలకు అద్భుతమైన విద్యను అందించడమే.. ఒక గొప్ప నాయకుడి నిజమైన బాధ్యత అన్నారు. ఎక్కువగా రాజాకీయ నాయకులు తమ ఊర్లలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకే. మొగ్గు చూపుతారన్నారు. అయితే... మైదుకురు ఎమ్మెల్యే మాత్రం మౌలిక వసతులకంటే ముందు విద్యాలయాన్ని నెలకొల్పితే.. ఎంతో మంది విద్యావంతులు, వారి ద్వారా ఎంతో మంది ప్రయోజకులు ఎత్పన్నం అవుతారన్న ఆలోచనతో మహా గురుకులం అభివృద్ధికి నిరంతరం శ్రమించారన్నారు. ఆయనతో పాటు ఆర్డీవో, అధికారుల కృషీ ఫలితమే.. ఈ మహా గూరుకులం పరిపూర్ణతకు నిదర్శనం అని ప్రశంసించారు. అందరి సమిష్టి కృషితోనే.. మహా గురుకులం లాంటి ఆదర్శనీయ భవనాలు మన ముందు గొప్ప విద్యాలయాలుగా ఎదుగుతాయన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఈ మహా గురుకులం జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలను అందిస్తోందని, అలాగే 2027 విద్య సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమమైన ఫలితాలను అందివ్వాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఈ మహా గురుకులం జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో రెపరెప లాడించే స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. 2016 లో ఈ గురుకులం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి అనుమతులు, టెండర్లు కూడా పూర్తి చేసి.. రూ. 21 కోట్ల వ్యయంతో మహా గురుకులం నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందన్నారు. సంబంధిత పనులను ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందన్నారు. కానీ గత ప్రభుత్వంలో మిగిలిన పెండింగ్ పనులను పూర్తి చేయడంలో అలసత్వం వహించిందన్నారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ వారి ప్రత్యేక చొరవతో రెండు వారాల్లోనే పెండింగ్ లో





ఉన్న ఫర్నిచర్, కిచెన్ సామగ్రి, కంప్యూటర్స్ తదితర వస్తువులను సమకూర్చడం జరిగిందన్నారు. అంతేకాకుండా.. తాజాగా రూ.1.23 కోట్ల వ్యయంతో రోడ్లు, ప్లే గ్రౌండ్, సుందరీకరణ పనులను పూర్తి చేయడంనారిగిందన్నారు. అడ్మిషన్లు పూర్తయ్యేలోపు అన్ని రకాల సిద్ధం చేయాలని సంబందిత అధికారులను అదేశించారు. మైదుకురు నియోజకవర్గ అభివృద్ధి కోసం.. జిల్లా కలెక్టర్ వారు ఎంతో సహాయ సహకారాలు అందించారని.. అందుకు ప్రజల తరపున, తన.తరుపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నామనన్నారు. మైదుకూరు నియోజకవర్గంలోని 5 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడంలో, అలగానూరు రిజర్వాయర్ కోసం రూ.36 కోట్లను మంజూరు చేయడం జరుగుతుందని హామీ ఇవ్వడంలో, బి.మఠం దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు రూ. 6 కోట్ల విడుదలకు హామీ ఇవ్వడంతో, మహా గురుకులం పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేయడంలో, అలాగే బి.మఠంలో కబ్జాకు గురైన 10 ఎకరాల స్మశాన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడంలో.. ప్రత్యేక శ్రద్ధ వహించిన ఘనత జిల్లా కలెక్టర్ గారికే దక్కుతుందన్నారు. ఈ విద్యాలయాన్ని కాపాడుకునే బాధ్యత మన చేతుల్లోనే ఉందన్నారు. అలాగే.. నియోజకవర్గానికే కాకుండా జిల్లాకే తలమానికంగా రూపు దిద్దుకోనున్న.. జవహర్ నవోదయ విద్యాలయాన్ని నిర్మించేందుకు పలుగురాళ్ల పల్లె రెవెన్యూ భూమిలో 30 ఎకరాల భూమిని కేటాయించడం గర్వించదగ్గ విషయం అన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ... సమాజంలో అన్నింటికీ మూలం ఒక్క విద్యనే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. ఒక్క పాఠశాల ఎంతో మంది ప్రయోజకులను తీర్చిదిద్దుతుందన్నారు. నేటి విద్యార్థి.. భవిష్యత్తులో ఒక ఉన్నత అధికారిగానో, ఒక రాజకీయవేత్తగానో, ఒక శాస్త్రవేతగానో.. ప్రజలకు సేవ చేయవచ్చన్నారు. విద్యాలయాలు దేశ అభివృద్ధికి మూలాల అనే విషయాన్ని కూడా గుర్తు పెట్టుకుని.. భవిష్యత్వరలో కూడా విలువలతో కూడిన విద్యను అందించే పాఠశాలలను నెలకొల్పాలని, ఉన్న పాఠశాలలను కాపాడాలని తెలిపారు. ఇలాంటి ప్రభుత్వ పాఠశాలలో చదివిన మేము.. మీ ముందు అధికార హెూదాలో ఉన్నామనంటే.. క్రమశిక్షణ, ఉపాధ్యాయుల పట్ల గౌరవం, ఉన్నత ఆశయంతో చదవడం వల్లనే సాధ్యం అయ్యాయన్నారు. ప్రతి ఒక్కరు ఒక లక్ష్యంతో చదవాలన్నారు. గురుకుల విద్యాలయాల జిల్లా కో.ఆర్డినెటర్ ఉషశ్రీ మాట్లాడుతూ.. ఒక గ్రామానికి బడి, గుడి ఉంటే ఆ గ్రామం ఆధ్యాత్మికంగా, వివేకవంతంగా అభివృద్ధి చెందడంతో పాటు.. ఆ ప్రాంత విద్యార్థులు, మంచి విలువలతో కూడిన విద్యతో పాటు.. అక్కడి ప్రజలకు సంస్కృతీ సంప్రదాయాలు అలవాడుతాయన్నారు. ఒక దేశం అభివృద్ధి కోరేవారు ఎవరైనా.. ప్రతి గ్రామంలో ఒక బడిని స్థాపించేందుకు ముందుకురావాలన్నారు. సమావేశానికి ముందు.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలురు) లో రూ.1.23 కోట్ల తో చేపట్టిన అభివృద్ధి పనులు – సిసి రోడ్లు, విద్యుదీకరణ, ఆటస్థలం మరియు మొక్కల పచ్చదనం పనులకు సంబంధించి.. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి.. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం.. తరగతి గదులు, హాస్టల్ గదుల వసతులను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటిన అనంతరం క్రీడా మైదానం, రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో చివరగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీలు.. హాస్టల్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, డీఈవో శంశుద్దిన్, ఎస్ఎస్ఏ ఎపిసిఎ. నిత్యానందరాజులు, సోషల్ వెల్ఫర్ డిడి సరస్వతి, డ్వామా పిడి ఆది శేషారెడ్డి, తహసిల్దార్ రాజసింహ నరేంద్ర, ఎంపిడిఓ వీర కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరుడు, ఎంపిపి వీర నారాయణ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## హస్త కళల కుటుంబం నుంచి వస్తున్న వారినీ ఇంకా ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్
వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ లక్ష్యంతో కళాకారులను ప్రోత్సాహించాలి
హస్త కళలు అంతరించి పోకూడదనేది ముఖ్య మంత్రి లక్ష్యం
ఏపి. హ్యాండ్ క్రాఫ్ట్ కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్



**తిరుపతి, పెన్ పవర్ జూలై 2 :** హస్త కళాకారులు మంచి జీవనోపాధి పెంపొందించుకోవాలంటే వారు తయారుచేసిన వస్తువులు యొక్క ఉత్పత్తి, లాభం, ప్రచారం చాలా అవసరమని జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ విసి హాల్ నందు జిల్లా డా.ఎస్. వెంకటేశ్వర్, ఎ.పి హ్యాండ్ క్రాఫ్ట్ చైర్మన్ డా.హరి ప్రసాద్ తో కలిసి డిఆర్డిఎ, డి ఐ సి, లేపాక్షి, శిల్పారామం, టూరిజం, నాబార్డ్ , హ్యాండ్ లూమ్స్, ఖాదీ బోర్డ్, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులతో మరియు హస్త కళలు, హ్యాండ్ లూమ్స్ కళాకారులు, అసోసియేషన్, సొసైటీల వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతి జిల్లాలో చుట్టుపక్కల గ్రామాల లోని చిన్న కుటుంబాల నుంచి కూడా ఎంతోమంది హస్త, కలంకారీ కళల పైన ఆధారపడి




తమ జీవనోపాధి చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో కలంకారి, హస్త కళలకు, మాధవ మాల, వెంకటగిరి చీరలకు, పాపా నాయుడుపేట పూసల కళాకారులకు దేశవ్యాప్తంగా మంచి పేరు, గుర్తింపు రావడం జరిగిందని గర్వంగా ఉందని పేర్కొన్నారు. హస్తకళలకు మంచి డిమాండ్ ఉందని అందువలన వీటికి అధిక ప్రాధాన్యత కల్పించవలసిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హస్త కళాకారులకు అండగా ఉంటుంది, వారి జీవనోపాధి పెంపొందించే దిశగా కృషి చేస్తుంది అని తెలిపారు. ఉత్పత్తి, లాభం, ప్రచారం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర కళాకారులను ప్రోత్సాహిస్తుందని అన్నారు. లేపాక్షి ఎంపోరియం అభివృద్ధి చేయడం, ప్రభుత్వ కార్యక్రమాలు నందు మన క్రాఫ్ట్ ప్రొడక్ట్స్ ఉండేలా చూడాలని తెలిపారు. మన జిల్లాలో ఉత్పత్తి చేసిన ఉత్పత్తులకు జియో టాకింగ్ చేయడం వలన ఆ ఉత్పత్తులను ఎవరు, ఎక్కడ తయారు చేస్తున్నారు వంటి విషయాలను తెలుసుకోవడం ద్వారా ఉత్పత్తుల యొక్క ప్రాధాన్యత మరియు ఎగుమతి చేయడం తద్వారా ఆదాయం పెరుగుతుందని అన్నారు. మన కళాకారులకి ఈ పరిశ్రమలో పనిచేస్తున్న వారికి ప్రతి కుటుంబానికి ఆదాయం పెంచే విధంగా ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో హస్తకళాకారులు పడుతున్న ఇబ్బందులు వారికి కావాల్సిన అవసరాలు తెలుసుకుని వారి అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. ఎయిర్ పోర్టు నందు హ్యాండ్ క్రాఫ్ట్ అవుట్లెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని పేర్కొన్నారు. నారాయణవనం శారీకను స్టాల్స్ ఏర్పాటు చేయడం, క్లస్టర్ స్థాయిలో అభివృద్ధి చేయడం వంటి ఏర్పాట్లు ఉంటుందని తెలిపారు. రుణాలు మంజూరు కు సంబంధించిన విషయంలో ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తప్పనిసరిగా అందేలా చూస్తామని తెలిపారు. హస్త కళాకారుల కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లాలో హస్త కళాకారుల సంబంధించిన సమావేశం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కళాకారులను, కళలను కాపాడుకోవాలని అనేది ముఖ్యమంత్రి, , ఉప ముఖ్యమంత్రి ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ లక్ష్యంతో హస్త కళాకారులను ప్రోత్సహించాలని అన్నారు. అగ్గిపెట్టెలో ఇమిడియెంత నేత నేసిన ఘనత మన కళాకారులది అని తెలిపారు. నెమ్మదిగా కళాకారుల యొక్క ప్రాధాన్యత వెనుకబడి పోతుందని వారిని ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. హస్త కళాకారుల యొక్క సమస్యలను తీర్చాలి వారిని ప్రోత్సహించాలనే దిశగా ప్రొడక్షన్, ప్రమోషన్, ప్రాఫిట్ అనే ఉద్దేశంతో వారికి అండగా ఉంటామని తెలిపారు. జిల్లాలో లేపాక్షి అభివృద్ధి దిశగా ఎంపోరియం ను ఏర్పాటు ఉంటుందని అన్నారు. తిరుపతి, తిరుమలలో పర్యాటకులను ఆకర్షించే దిశగా లేపాక్షి షో రూమ్ లను ఏర్పాటు చేయడం వలన జాతీయస్థాయిలో మంచి గుర్తింపు వస్తుందని అన్నారు. శ్రీకాళహస్తి, తిరుపతి పుత్తూరులో ఎక్కువగా కళాకారులు చేత స్వయంగా తయారైన వస్తువులను అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు ప్రధానమంత్రికి సమర్పించడం జరిగిందని ఇది గర్వించ దగ్గ విషయం అని అన్నారు. ఈరోజు ఏర్పాటు చేసినటువంటి సమావేశంలో కళలను ఎలా ముందుకు తీసుకో వెళ్లాలి అనే ప్రధాన ఉద్దేశం గా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా హస్త కళలను విస్తరింప చేయాలి అని తెలిపారు. హైదరాబాద్, ఢిల్లీ ,కలకత్తా లో ఉన్నాయని మంచి హ్యాండ్ క్రాఫ్ట్ ఉన్నాయని తెలిపారు. మన జిల్లాలో మన కళాకారుల చేత తయారు చేయబడిన వస్తువులకు ప్రాధాన్యత పెరగాలంటే వాటి ప్రమోషన్ చేయడం చాలా అవసరమని, ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ప్రతి కార్యాలయం నందు హస్తకళల వస్తువులను ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. తిరుపతి, తిరుమలకు వచ్చే అతిథులకు లేపాక్షి వస్తువులను అందించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హస్త కళల వస్తువులకు జియో టాకింగ్, %జు –ంష్ఘుతీఏ , +ర్% మొదలగు సౌకర్యాలు కల్పన వలన ప్రాధాన్యత పెరుగుతుందని తెలిపారు. జాతీయస్థాయిలో అవార్డు పొందిన వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని తిరుపతి జిల్లాను హస్తకళనందు మొదటి స్థానంలో ఉంచాలని కోరారు. హస్త కళాకారులకు సహాయం చేయడం మొదటి ఉద్దేశం అని వారికి కావలసిన సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తామని అన్నారు. మాధవమాలలో పనిచేసే కళాకారులకు వారి జీవనోపాధి పెంపొందించే దిశగా సంబంధిత అధికారులు కృషి చేయాలని తెలిపారు. వారికి జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు వాటి ప్రమోషన్ కూడా చాలా అవసరం అని అప్పుడే వస్తువుల యొక్క ప్రాముఖ్యత పెరుగుతుందని తెలిపారు. సమావేశానికి ముందు జిల్లా కలెక్టర్ , ఎ.పి హ్యాండి క్రాఫ్ట్స్ చైర్మన్తో కలసి కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కళంకారీ , హ్యాండి క్రాఫ్ట్స్ శాఖా వారు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను పరిశీలించి వాటి తయారీ విధానం గురించి కళాకారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశ అనంతరరం వుడ్ కార్వింగ్, కళంకారీ , హ్యాండ్ లూమ్స్ రంగాలలో జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన వివిధ కళాకారులకు జిల్లా కలెక్టర్ సాలువ, మోమెంతో తో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎ డి హస్తకళలు సత్యమూర్తి, ఎ డి చేనేత వస్త్రాలు రమేష్, ఎ.డి. ఎ.పి.కె.వి.ఐ.బి. వెంకట రావు, ఎ.డి. ఎం.ఎస్.ఎం.ఈ. మూర్తి, ఎల్డిఎం రవి కుమార్, పర్యాటకశాఖ ఆర్ డి రమణ ప్రసాద్, పి డి డి ఆర్ డి ఎ శోభన్ బాబు, ఎ పి డి ప్రభావతి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చంద్రశేఖర్, సెట్విన్ సీఈవో మోహన్ కుమార్, కళాశృష్టి ఎన్ జి ఓ దశరథ ఆచారి, బాలాజీ వుడ్ కార్వింగ్ ఆర్టిస్ట్ దొరస్వామి, జిల్లా అధికారులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మన మనస్సు యొక్క సామర్థ్యాన్ని మనం ఏ మేరకు అభివృద్ధి చేసుకోగలమో మనకు తెలుసా?

పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి





**కడప పెన్ పవర్ జూలై 2 :** నిగూఢమైన మన మనస్సు మనం అనుకున్నదానికంటే చాలా క్లిష్టమైనది. మన ఈ భౌతిక శరీరంలో, ఈ చిన్న మనస్సు లెక్కలేనన్ని అవకాశాలను కలిగి ఉంది, కానీ విచారకరమైన విషయం ఏమిటంటే దాని శక్తి గురించి మనకు తెలియదు. ఈ మనసు విషయాలను గుర్తుంచుకుంటుంది, సంఘటనలను దాచుకుంటుంది, కానీ మన స్వంత మనసు సామర్థ్యాన్ని మనం గుర్తించలేకపోతున్నాం!! నిజానికి మన మనస్సును కూడా మనం సరిగా ఉపయోగించం. మనస్సు ఉపయోగించి చేయాల్సిన విషయాలను, మనం సాంకేతికత మీద వదిలిపెట్టాం. మన మెదడుకున్న శక్తి నేటి సాంకేతికత అంటే – రోబోలు, మొబైల్ లు, కంప్యూటర్ ల కంటే చాలా ఎక్కువ అని బహుశా మనకు తెలియకపోవచ్చు, ఎందుకంటే వీటన్నింటిని కనిపెట్టింది, సృష్టించింది మన మానవ మెదడు, మన మేధస్సే.

ఈ విషయంలో స్వామి వివేకానందకు సంబంధించిన ఒక యధార్థ సంఘటనను ఒక్కసారి చూద్దాం... స్వామీజీకి అపారమైన జ్ఞాపకశక్తి ఉందనేది అందరికీ తెలిసిన విషయమే. ఆయన పుస్తకాన్ని మొత్తం చాలా త్వరగా చదివడమే కాకుండా ప్రతీ పదాన్ని కూడా గుర్తుంచుకోగలిగేవారు. వివేకానంద దేశ పర్యటనలో జరిగిన సంఘటన ఇది. ఆయనతో పాటు ఒక గురుసోదరుడు కూడా ఉన్నాడు, అతను కూడా తన గురువు శిష్యుడు. ఈ పర్యటనలో మంచి పుస్తకాలు ఎక్కడ దొరికినా, ఆయన వాటిని చదవడానికి ఇష్టపడేవారు. ఏదైనా కొత్త ప్రదేశాన్ని సందర్శించినప్పుడు ఆయన మొదటగా వెతికేది గ్రంథాలయం కోసమే. ఒకసారి ఒక చోట గ్రంథాలయం చాలా నచ్చటం వలన కొన్ని రోజులు అక్కడే ఉండాలనుకున్నారు. తోటి గురుసోదరుడు ఆ గ్రంథాలయం నుండి ఇంగ్లీషు, సంస్కృతంలో కొత్త పుస్తకాలు తెచ్చేవాడు, వివేకానంద ఆ పుస్తకాలను చదివి మరుసటి రోజు తిరిగి ఇచ్చేవారు. ప్రతిరోజూ కొత్త పుస్తకాలను తీసుకోవడం, మరుసటి రోజు వాటిని తిరిగి ఇచ్చేయడం – గ్రంథాలయాధికారి ఈ పద్ధతిని చాలా ఆశ్చర్యంతో, ఆసక్తిగా గమనించేవాడు. అతను స్వామీజీ తో వచ్చిన సోదరునితో ఇలా అన్నాడు, "మీరు ఇన్ని కొత్త పుస్తకాలను కేవలం చూడడానికి మాత్రమే తీసుకుంటారా? వాటిని చూడాలనుకుంటే, నేను మీకు అన్ని పుస్తకాలను ఇక్కడే చూపిస్తాను, ప్రతీ రోజు వాటిని తీసుకెళ్తున్నారు, తిరిగి తీసుకువస్తున్నారు – మీరు అనవసరంగా పుస్తకాల బరువును మోస్తున్నారు . ఇది తెలివైన పనిగా అనిపించట్లేదు, నాకు కూడా నచ్చట్లేదు." స్వామీజీ తోటి సోదరుడు గ్రంథాలయాధికారికి చాలా నిజాయితీగా ఇలా సమాధానమిచ్చాడు, "అయ్యా, మీరు దీనిని తప్పుగా అర్థం చేసుకున్నట్లుగా ఉన్నారు. నా గురుసోదరులు వివేకానంద ఈ పుస్తకాలను చాలా చిత్తశుద్ధితో చదువుతారు. ఆయన పూర్తిగా చదివిన తర్వాత మాత్రమే, నేను పుస్తకాలు తిరిగి ఇవ్వడానికి ఇక్కడికి వస్తాను." గ్రంథాలయాధికారి చెప్పింది విన్నాడు, కానీ నమ్మలేదు. అయితే, ఆ వ్యక్తి నిజాయితీ చూసి, "అలా అయితే, నేను ఒకసారి మీ గురుసోదరులు, వివేకానందగారిని కలవాలనుకుంటున్నాను." అని అన్నారు. మరుసటి రోజు, స్వామి వివేకానంద తన గురుసోదరులతో కలిసి గ్రంథాలయాధికారిని కలుసుకుని, "అయ్యా, ఆశ్చర్యపోకండి. నేను మీ గ్రంథాలయం నుండి తెచ్చిన అన్ని పుస్తకాలను చదవడమే కాకుండా, చదివినవన్నీ గుర్తుంచుకుంటాను కూడా", అని అన్నారు. ఇలా చెబుతూ, తిరిగి ఇవ్వాల్సిన కొన్ని పుస్తకాలను గ్రంథాలయాధికారికి అందజేసి, ఆ పుస్తకాల్లోని ముఖ్యమైన విషయాలను వివరించారు. గ్రంథాలయాధికారి ఆశ్చర్యపోయాడు. ఆ పదునైన జ్ఞాపకశక్తికి రహస్యం ఏమిటని అడగకుండా ఉండలేకపోయాడు. స్వామి వివేకానంద ఇలా అన్నారు, "దేని మీదైనా ఆలోచన లేని మనస్సుతో దృష్టి పెడితే, అది మన జ్ఞాపకశక్తిలో పూర్తిగా నిక్షిప్తమవుతుంది. మన మనస్సు ఆ విషయాలను ఎప్పటికీ మరచిపోదు. అందుకోసం మన మనస్సు యొక్క శక్తిని గుర్తించడం చాలా ముఖ్యం. సాధన, ధ్యానం ద్వారా ఈ శక్తి సాధ్యపడుతుంది." స్వామి వివేకానంద ధ్యానం చాలా ఎక్కువగా చేసేవారని మనందరికీ విదితమే. సమయం దొరికినప్పుడల్లా ఆయన పుస్తకాలు చదివేవారు లేదా ధ్యానం చేసేవారు. సరియైన మార్గంలో ధ్యానం చేయడం ద్వారా, ఒక స్థితి ఏర్పడుతుంది, ఆ స్థితి మనల్ని మారుస్తుంది. అప్పుడు మనం మనస్సు యొక్క సంక్లిష్టత నుండి హృదయపు సరళత వైపుకు వెళ్తాము.

దాజీజి
హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం కడప.

## సుపరిపాలనలో తొలి అడుగు తొత్తరమూడిలో ప్రారంభించిన జిల్లా టిడిపి అధ్యక్షులు



అమలాపురం పెన్ పవర్ జూలై 2: పి.గన్నవరం నియోజకవర్గం %–% అయినవిల్లి మండలం, తొత్తరమూడి లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం, ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం , జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి, స్థానిక టీడీపీ నేతలు, బూత్ స్థాయి,యూనిట్ స్థాయి,క్లస్టర్ స్థాయి, కె .ఎస్.ఎస్. సభ్యులు గ్రామ కమిటీ సభ్యులు,మండల కమిటీ సభ్యులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రజలతో ఇంటింటికి వెళ్లి...**

4.1 పేరుతో గత ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలపై అవగాహన కలిగించారు. విశ్వాసం భద్రత అభివృద్ధి ఈ మూడు సూత్రాలతో ముందుకు సాగుతున్న తెలుగుదేశం పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది..


## జిల్లాపరిషత్ స్థలం నివాసితులకు పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రశాంతికి ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు వినతి
- సానుకూలంగా స్పందించిన కలెక్టర్



**గోకవరం, పెన్ పవర్, జులై 02 :** గోకవరంలోని జిల్లా పరిషత్తుకు చెందిన స్థలంలో సుమారు 70 సంవత్సరాలుగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న సుమారు 120 మందికి పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతికి గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు విజప్తి చేశారు. బుధవారం కాకినాడ జిల్లా పరిషత్ సమావేశంలో ఈ మేరకు కలెక్టర్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జిల్లా పరిషత్ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పొజీషన్ సర్టిఫికేట్ లేకపోవడం వలన పంచాయతీ వారు పన్నులు వేయడం లేదని, దీనివలన వారు కనీసం ఇంటి లోను పొందడానికి కూడా అర్హత లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై సుమారు 24 సంవత్సరాల క్రితం తాను జెడ్పీటీసీగా ఉన్న సమయం నుంచి పోరాటం చేస్తున్నానని ఇప్పటికైనా వారికి పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్ను కోరడం జరిగిందన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ జెడ్పీసిఈఓకు ఎన్ఓసీ ఇవ్వాలని ఆదేశించినట్లు ఎంపీపీ తెలిపారు.

## ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి : పిహెచ్సి వైద్యాధికారిని డాక్టర్ భావన



**గంగవరం, పెన్ పవర్, జూలై 2 :** విద్యార్థులు వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ భావన సూచించారు. బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య రికార్డులను సిద్ధం చేశారు. బాలికలకు సీజనల్ వ్యాధులైన మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ తదితర వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సింగయ్య మృతిపై అనుమానాలు.. భార్య 'సంచలన' ఆరోపణలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ కార్యకర్త సింగయ్య మరణంపై తమకు అనుమానాలు ఉన్నట్లు ఆయన భార్య లూర్దు మేరి తెలిపారు. చిన్న చిన్న గాయాలకే ఆయన మరణించాడని తాము భావించడం లేదని, అంబులెన్స్ లో ఏదో జరిగిందని సందేహం వ్యక్తం చేశారు. పోలీసులు, ప్రభుత్వం నుంచి ఈ కేసుపై తమపై తీవ్ర ఒత్తిడి ఉందని ఆమె ఆరోపించారు. సుమారు 50 మంది లోకేశ్ అనుచరులు తమ ఇంటికి వచ్చి బెదిరించారని, తాము చెప్పినట్లు చెప్పాలని ఒత్తిడి చేశారని ఆమె పేర్కొన్నారు. మేము కూడా మీ కులస్థులమేనంటూ కాగితాలపై ఏదో రాసి తమపై ఒత్తిడి చేసినట్లు సంచలన ఆరోపణలు చేశారు లూర్దా మేరి.గత నెల 18న మాజీ సీఎం జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన ప్రమాదంలో వైసీపీ కార్యకర్త సింగయ్య మరణించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి జగన్ కాన్వాయ్ కాదని ఒకసారి, ఆయన కాన్వాయ్ లోని ప్రైవేటు కారు అంటూ మరోసారి పోలీసులు ప్రకటనలు చేశారు. పర్యటన ముగిసిన రెండు రోజులుకు మాజీ సీఎం జగన్ కారు కిందే సింగయ్య పడిపోయిన దృశ్యాలతో వీడియో విడుదల చేశారు. దీంతో ఈ ఘటనపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగింది.సుమారు 15 రోజులపాటు ఈ వివాదం కొనసాగగా, పోలీసులు ప్రమాదానికి కారణమైన జగన్ కారు డ్రైవర్ రమణారెడ్డిపై కేసు నమోదు చేశారు. అంతేకాకుండా ప్రమాద సమయంలో కారులోనే ఉన్న మాజీ సీఎం జగన్ తోపాటు మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజిని, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, జగన్ పీఏ కేఎన్ఆర్ ను కూడా నిందితుల జాబితాలో చేర్చారు. దీనిపై మాజీ సీఎంతో సహా మిగిలిన నిందితులు హైకోర్టును ఆశ్రయించి తదుపరి చర్యలు తీసుకోకుండా ఉపశమనం పొందారు.ఈ పరిస్థితుల్లో సింగయ్య మరణంపై తమకు అనుమానాలు ఉన్నాయని ఆయన భార్య లూర్దామేరి ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. అంతేకాకుండా తమపై టీడీపీ యువనేత లోకేశ్ అనుచరులు ఒత్తిడి చేశారని ఆమె చెబుతున్నారు. తమను మాజీ సీఎం జగన్ మాత్రమే ఆదుకున్నారని ఆమె వ్యాఖ్యానించారు. దీంతో ఈ వివాదం మలుపు తిరిగినట్లు భావిస్తున్నారు.

# లేటెస్ట్ అప్ డేట్.. వంశీ సేఫ్.. ఇక, ఇంటికే!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి అన్ని వైపుల నుంచి ఊరట లభించింది. నాలుగు కేసులు దాఖలు కాగా.. వాటన్నింటికీ బెయిల్ లభించింది. అయితే.. మూడో కేసులో అంటే.. గన్నవరంలో మైనింగ్ అక్రమాలకు పాల్పడ్డారని నమోదైన కేసులో స్థానిక కోర్టు బెయిల్ ఇచ్చినా.. ప్రభుత్వం మాత్రం దీనిని సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు గతంలో హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసేందుకు నిరాకరించింది. అదేవిధంగా ఈ కేసులోనే సీతామహాలక్ష్మి అనే మహిళ కూడా ఇంప్లీడ్ అయ్యారు. తన స్థలాన్ని వంశీ అను చరులు కబ్జా చేశారని ఆమె కేసు పెట్టారు. దీనిపై గన్నవరం పోలీసులు.. కేసు కట్టారు. అయితే.. దీనిని క్రిమినల్ కేసుగా పేర్కొన్నారు. దీనిలోనూ బెయిల్ వచ్చింది. అయితే.. ఈ బెయిల్ను రద్దు చేయాలని కోరుతూ.. సీతామహాలక్ష్మి కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా దీనిపైనా విచారణ చేసిన కోర్టు.. అసలు సివిల్ కేసులో పోలీసులకు పనేంటని ప్రశ్నించింది.అంతేకాదు.. సివిల్ కేసును క్రిమినల్ కేసుగా మార్చే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో వంశీ బెయిల్‌ను రద్దు చేయడానికి నిరాకరించింది. ఇలా.. మొత్తంగా అన్ని కేసుల్లోనూ వల్లభ నేనికిబెయిల్ లభించింది. దీంతో ఆయనను బుధవారం జైలు నుంచి పంపించనున్నారు. ఇదిలావుంటే.. గన్నవరంలో సంబరాలు చేసేందుకు కార్యకర్తలు ఏ ర్పాట్లు చేస్తున్నారు. అయితే.. వీటిని పోలీసులు అడ్డుకున్నారు. ఎ లాంటి సంబరాలకు అనుమతులు లేవని పేర్కొన్నారు.

# తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు!



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలు మరోసారి వాడివేడిగా మారాయి. ముఖ్యంగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆయన చేసిన ఆరోపణలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

### చంద్రబాబు కోవర్టుల పాత్రపై ఆరోపణలు

ప్రాజెక్టుల వెనుక చంద్రబాబు కోవర్టుల పాత్ర ఉందని అనిరుధ్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. "బనకచర్ల విషయంలో ఒక ఎమ్మెల్యేగా నేను ఓ సూచన చేస్తున్నాను. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్న లెటర్లు రాసుడు కాదు. అసలు విషయం ఏమిటంటే.. చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారు. వారే ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూస్తున్నారు" అంటూ మండిపడ్డారు.

ఈ కోవర్టులకు కరెంట్ కనెక్షన్, నీటి కనెక్షన్ కట్ చేయాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకూడదని ఆయన సూచించారు. "వాళ్లే చంద్రబాబుని కలిసి బనకచర్ల ప్రాజెక్టు పై స్టే తెప్పిస్తారు. మంచిగా మాట్లాడితే ఆంధ్రవాళ్లు వినరు" అని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

### రాజకీయ దుమారం, భిన్నాభిప్రాయాలు

ఇటీవలి కాలంలో తెలంగాణలో పాలన, ప్రాజెక్టుల అమలులో అనేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు వివాదానికి దారితీసే అవకాశం ఉంది. గతంలో కూడా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులపై రాజకీయ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, తాజా వ్యాఖ్యలు కొత్త దుమారాన్ని రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలు ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా పంచుకోబడుతూ భిన్నాభిప్రాయాలకు తావిస్తున్నాయి. తెలంగాణ-ఆంధ్ర సంబంధాల విషయంలో మరోసారి ఉత్కంఠ పరిస్థితులు నెలకొనవచ్చన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకులలో వ్యక్తమవుతోంది.

### ప్రభుత్వ స్పందనపై డిమాండ్లు

మొత్తానికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అధికారిక స్థాయిలోనూ, విపక్షాల స్థాయిలోనూ స్పందన కోరుకుంటున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ప్రగతివంతమైన క్లారిటీ ఇవ్వాలన్న డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మలుపు తిరుగుతాయో చూడాలి.

# 2029 ఎన్నికలు : సీబీఎన్ Vs జగన్.. AI చెబుతుంది ఇదే..





**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో ఎన్నికలు ముగిసి ఏడాది మాత్రమే అయింది. ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉంది. అయితే జమిలి ఎన్నికల ప్రచారంతో ఎన్నికలు ముందుగా జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రతిపక్ష నేత, మాజీ సీఎం జగన్ అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన ఆయన తన ఓటమికి ఈవీఎం గోల్ మాల్ అంటూ ఆరోపిస్తున్నారు. సుమారు 40 శాతం ఓటు బ్యాంకు ఉన్న వైసీపీకి కేవలం 11 సీట్లు రావడంపై జగన్, ఆయన పార్టీ నేతలు ఇప్పటికీ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో 2029 ఎన్నికల్లో మళ్లీ గెలిచి అధికారం చేపట్టాలని ఇప్పటి నుంచే ప్రణాళిక రచిస్తున్నారు. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. మరోవైపు అధికార కూటమి కూడా ప్రతిపక్షానికి 11 సీట్లు మాత్రమే వచ్చాయని అజాగ్రత్తగా ఉండొద్దని తన ఎమ్మెల్యేలను నిరంతరం అప్రమత్తం చేస్తూనే ఉంది. వచ్చే ఎన్నికలలో వరుసగా గెలిచి అధికారాన్ని సుస్థిరం చేసుకునేలా వ్యూహాలు రచిస్తోంది. ఇటీవల సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం, ఆ తర్వాత టీడీపీ ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు టార్గెట్ 2029పై విస్పష్ట సంకేతాలు పంపారు. ఈ నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వచ్చే ఎన్నికల నాటికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మధ్య పోటీ ఎలా ఉంటుందన్న ప్రశ్నకు ఆసక్తికర విశ్లేషణ తెలియజేసింది. 2024 ఎన్నికల్లో మూడు పార్టీల కూటమి ద్వారా సుమారు 55 శాతం ఓటు బ్యాంకు సాధించి ఘన విజయం సాధించింది. ఇందులో టీడీపీకి సొంతంగా 45.6 శాతం ఓటు షేరు సాధించింది. ఈ ప్రజామద్దతు నిలుపుకుని 2029 ఎన్నికలకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారని ఏఐ తెలియజేసింది. అంతేకాకుండా తమ అధికారాన్ని నిలుపుకునేందుకు మూడు పార్టీల కూటమి బలంగా ఉండాలని కోరుకుంటున్నారని, డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి సాధిస్తున్నామని ప్రచారం చేస్తున్నారని తెలిపింది. ముఖ్యంగా కేంద్రీకృత అభివృద్ధి అజెండాతోనే ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని ఏఐ విశ్లేషించింది. అదేసమయంలో ప్రతిపక్ష నేత జగన్ ఎస్సీ, ఎస్టీలతోపాటు తనకు ఉన్న 40 శాతం ఓటు బ్యాంకును నిలుపుకుని ఇతర వర్గాలను ఆకట్టుకునేలా ప్రణాళిక బద్ధంగా నడుస్తున్నారని ఏఐ తెలిపింది. 2029 ఎన్నికల్లో కచ్చితంగా గెలుస్తానన్న నమ్మకంతో ఉన్న జగన్ ముందుగా పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేసేలా అడుగులు వేస్తున్నారని అంచనా వేసింది. ఇక ఇరువురు నేతల బలాబలాలు, బలహీనతలపైనా ఏఐ ఆసక్తికర విశ్లేషణ తెలియజేసింది. 2024 ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనపై కొంత వ్యతిరేకత కనిపిస్తున్నా పట్టణ మధ్య తరగతి, అగ్రవర్ణాలు, ఓబీసీల మద్దతు చెక్కుచెదరలేదని అంచనా వేసింది. అదేవిధంగా కూటమి పాలన ద్వారా మౌలిక సదుపాయాలు కల్పన, సంక్షేమ పథకాలు ద్వారా గ్రామీణ పేదలు, ఎస్సీ, ఎస్టీలను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పింది. కూటమి భాగస్వామ్య పక్షాలు బీజేపీ, జనసేనతో సమన్వయం కొనసాగించడం కూడా ముఖ్యమంత్రి చంద్రబాబును బలానికి కారణంగా చెబుతోంది. అదే సమయంలో వైసీపీలో జగన్ నాయకత్వంపై కేడర్ కు పూర్తి విశ్వాసం ఉండటం ఆయనకు బలం చేకూర్చుతోందని ఏఐ విశ్లేషించింది. అభివృద్ధి, పెట్టుబడుల సాధన, కొత్త ఉద్యోగాల సృష్టి వంటి అంశాలను ఎన్నికల ప్రచార అస్త్రాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు వాడుకునే అవకాశాలు ఉన్నాయని చెబుతున్న ఏఐ .. అదే విషయంలో జగన్ మాత్రం తనకు ఉన్న గ్రామీణ మద్దతుదారులు,

ఎస్సీ, ఎస్టీ ఓటు బ్యాంకుపైనే ఎక్కువ నమ్మకం పెట్టుకున్నారని తెలిపింది. అదేవిధంగా టీడీపీ పట్టణ పార్టీగా.. వైసీపీ గ్రామీణ పార్టీగా అభివర్ణించింది. మంచి వాగ్దాటి, గ్యారెంటీ హామీల అమలు, భాగస్వామ్య పక్షాలతో సంయుక్త పోరాటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతుండగా, జగన్ గ్రామ స్థాయి నుంచి పార్టీని పునః నిర్మించుకోడానికి జిల్లాల పర్యటనలు, పాదయాత్ర వంటి కార్యక్రమాలతో పార్టీని 2029 ఎన్నికలకు సిద్ధం చేయాలని చూస్తున్నారని ఏఐ విశ్లేషించింది.

# నిన్న 'మే డే' కాల్, నేడు 'డొంట్ సింక్' అలర్ట్... ఇది ఎందుకో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** జూన్ 12న అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంతో ప్రపంచం మొత్తం ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఈ ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న వారు 241 మంది, బయట పౌరులు 19 మంది మరణించారు. ఆ విమానం ప్రమాదానికి గురయ్యే సెకన్ల ముందు పైలెట్ల నుంచి ఏటీసీకి "మే డే" కాల్ వచ్చిన సంగతి తెలిసిందే.దీంతో... ఏమిటీ మే డే కాల్ అనే చర్చ జరిగిన సంగతి తెలిసిందే. ఇది విమానంలో సమస్య ఎదురైనప్పుడు పైలెట్ల నుంచి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కు వచ్చే కాల్. అయితే... ఆ ప్రమాదం జరిగిన 38 గంటల్లోనే మరో ఎయిరిండియా విమానం టెన్షన్ పెట్టింది. ఇందులో భాగంగా... జూన్ 14 తెల్లవారుజామున ఢిల్లీ నుండి బయలుదేరి వియన్నాకు వెళ్తున్న బోయింగ్ 777 విమానం స్టాల్ హెచ్చరికను అందుకుంది.అవును... జూన్ 14 తెల్లవారుజామున ఢిల్లీ నుండి బయలుదేరి వియన్నా విమానం ఒక్కసారిగా 900 అడుగుల మేర కిందికి దిగిపోయింది. దీంతో... విమానంలోని ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. ఆ సమయంలో... గ్రౌండ్ ప్రాక్సిమిటీ వార్నింగ్ సిస్టమ్స్ (జీ.పీ.డబ్ల్యూ.ఎస్) నుంచి వార్నింగ్ సిగ్నల్ వెలువడింది.. అదే... "డోంట్ సింక్"! ఆ అలర్ట్ ఏమిటనేది ఇప్పుడు చూద్దాం..!విమానం ల్యాండింగ్ సమయంలో లేదా భూమికి దగ్గరగా ఉన్నప్పుడల్లా మోడ్ - 1 హెచ్చరిస్తుంది. ఈ క్రమంలో వెలువడే ప్రారంభ హెచ్చరిక "సింక్ రేట్" (విమానం ఎత్తును కోల్పోయే రేటు) కాగా... విమానం పర్వతం పైకి లేదా నిటారుగా ఉన్న ప్రదేశాల మీదుగా ఎగురుతుంటే, అప్పుడు గ్రౌండ్ క్లియరెన్స్ వేగంగా తగ్గుతుంటే.. మోడ్ - 2 "పుల్ అప్" అని హెచ్చరిక జారీ అవుతుంది.ఇక... టేకాఫ్ తర్వాత పైలట్ లు సానుకూల ఆరోహణ రేటును నిర్వహించడానికి మోడ్ - 3 సహాయ పడుతుంది. ఇందులో భాగంగా... విమానం 1,000 అడుగులకు చేరుకున్న తర్వాత.. ఒక్కసారిగా ఎత్తు దిగడం ప్రారంభిస్తే సిస్టమ్ "డోంట్ సింక్" అనే హెచ్చరికను వినిపిస్తుంది. అదేవిధంగా... ల్యాండింగ్ గేర్ లేదా ఫ్లాప్ లు ల్యాండింగ్ కోసం సరిగ్గా కాన్ఫిగర్ చేయకపోతే మోడ్ - 4 హెచ్చరిస్తుంది.అంటే... విమానం చాలా వేగంగా కిందకు దిగుతున్నప్పుడు, ముఖ్యంగా భూమిని సమీపిస్తున్నప్పుడు లేదా భూమికి దగ్గరగా ఉన్నప్పుడు గ్రౌండ్ ప్రాక్సిమిటీ వార్నింగ్ సిస్టమ్ (జీ.పీ.డబ్ల్యూ.ఎస్) ద్వారా "డోంట్ సింక్" (మునిగిపోవద్దు) హెచ్చరికలు జారీ చేయబడతాయి. ఈ హెచ్చరికలు పైలట్ లకు ప్రమాదకరమైన పరిస్థితులను నివారించడానికి సహాయపడతాయి.కాగా... అత్యవసర ప్రమాద పరిస్థితిని ఎదుర్కొంటున్నామనే విషయాన్ని రేడియో కమ్యునికేషన్ ద్వారా సమీపంలోని ఏటీసీ కి తెలియజేయడానికి చేసేదాన్ని మేడే కాల్ అంటారనే సంగతి తెలిసిందే. అంటే... తాము ఆపదలో ఉన్నామని, తక్షణమే సాయం కావాలని విజ్ఞప్తి చేయడం అన్నమాట. ఎమర్జెన్సీ సమయాల్లో పైలెట్లు 'మేడే' అనే పదాన్ని మూడు సార్లు చెబుతారు!

# జగన్ నెల్లూరు పర్యటన రద్దు.. కారణం అదేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి నెల్లూరు జిల్లా పర్యటన తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. 3వ తేదీ గురువారం జగన్ నెల్లూరు పర్యటనకు ముందుగా షెడ్యూల్ ఖరారైంది. ఈ పర్యటనలో భాగంగా ఆయన అక్రమ మైనింగు కేసులో అరెస్టు అయిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించాలని భావించారు. అయితే హెలీపాడ్ ఎంపిక విషయంలో వైసీపీ, పోలీసులకు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జగన్ పర్యటన వాయిదా వేసుకున్నారు.

నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో ములాఖత్ అయ్యేందుకు జగన్ అనుమతి కోరారు. దీనికోసం జైలుకు సుమారు పది కిలోమీటర్ల దూరంలో హెలిపాడ్ ఏర్పాటుకు అక్కడి నుంచి ర్యాలీగా జైలుకు వచ్చేందుకు వైసీపీ నేతలు అనుమతి కోరారు. అయితే వైసీపీ వినతిని పరిశీలించిన పోలీసులు జగన్ వచ్చే హెలికాప్టర్ కోసం సెంట్రల్ జైలు సమీపంలో హెలిపాడ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అయితే అక్కడ హెలిపాడ్ ఏర్పాటు చేయడం వల్ల జగన్ ప్రజలను కలిసే అవకాశం ఉండదని భావించిన వైసీపీ పోలీసుల ప్రతిపాదనను తిరస్కరించింది. అంతేకాకుండా హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయని, తుప్పలు ఎక్కువగా ఉండటం, రోడ్డు వసతి లేకపోవడంతో పోలీసులు సూచించిన చోట హెలిపాడ్ నిర్మాణం సాధ్యం కాదని వైసీపీ చెబుతోంది. దీనిపై కోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తోంది. జగన్ పర్యటనను అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసుల ద్వారా ప్రయత్నాలు చేస్తోందని వైసీపీ ఆరోపిస్తోంది.

తాము అధికారంలో ఉండగా, చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటనలు అడ్డుకున్నామా? అంటూ ప్రశ్నిస్తోంది. అయితే గత నెల 18న జగన్ పల్నాడు పర్యటనకు వెళ్లిన సమయంలో ముగ్గురు మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలను దృష్టిలో పెట్టుకుని జగన్ పర్యటన ప్రశాంతంగా ముగిసేలా జైలుకు సమీపంలోనే హెలిపాడ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు పోలీసులు చెబుతున్నారు. దీంతో జగన్ నెల్లూరు పర్యటన మరోమారు అధికార, విపక్షాల మధ్య వాడివేడి మాటల యుద్ధానికి తెరలేపింది.

# బ్యాలన్స్ అదిరింది.. బ్యాటింగ్ డెప్త్ పెరిగింది: రెండో టెస్టుకు టీమిండియా ఆర్డర్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో బుధవారం (జూలై 2) ప్రారంభమైన తొలి టెస్టులో టీమిండియా మూడు మార్పులతో బరిలోకి దిగింది. ఈ మార్పులు భారత జట్టు సమతుల్యంగా ఉండేలా చేశాయి. ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి, స్పిన్ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్ తుది జట్టులో స్థానం సంపాదించారు. వర్క్ లోడ్ కారణంగా బుమ్రాకు ఈ మ్యాచ్ లో రెస్ట్ ఇచ్చారు. శార్దూల్ ఠాకూర్, సాయి సుదర్శన్ లపై వేటు పడింది. బర్మింగ్‌హామ్ వేదికగా ఎడ్జ్ బాస్టన్ స్టేడియంలో టీమిండియా చేసిన ఈ మూడు మార్పులు కలిసి వచ్చేవే. టీమిండియా ప్లేయింగ్ 11 లోకి వచ్చిన ముగ్గురు కూడా బ్యాటింగ్ తో పాటు బౌలింగ్ చేయగలరు.నితీష్ కుమార్ కు ఆస్ట్రేలియాలో సెంచరీ చేసిన రికార్డ్ ఉంది. ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ స్వదేశంలో కీలక ఇన్నింగ్స్ లు ఆడి ఆకట్టుకున్నాడు. ఆకాష్ దీప్ సైతం చివర్లో బ్యాట్ ఝుళిపించగలడు. 9 వ స్థానం వరకు టీమిండియా బ్యాటింగ్ డెప్త్ బాగుంది. సాయి సుదర్శన్ స్థానంలో కరుణ్ నాయర్ రెండో టెస్టులో మూడో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. టాపార్డర్ లో బ్యాటింగ్ చేయగలిగే కరుణ్.. తనను తాను నిరూపించుకోవడానికి ఇది చక్కటి అవకాశం. 6, 7, 8 స్థానాల్లో నితీష్, జడేజా, సుందర్ బ్యాటింగ్ వలన బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా కనిపిస్తుంది. అదే సమయంలో జట్టులో ముగ్గురు ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్ ల్లో భారత లోయర్ ఆర్డర్ విఫలమైంది. తొలి ఇన్నింగ్స్ లో చివరి 41 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. ఇక రెండో ఇన్నింగ్స్ లోనూ అదే పరిస్థితి. చివరి 31 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకుంది. తొలి ఇన్నింగ్స్ లో 600 పరుగులు భావించినా కనీసం 500 పరుగులు కూడా మన జట్టు చేయలేకపోయింది. రెండో ఇన్నింగ్స్ లో 450 పరుగుల ఆధిక్యం ఖాయమనుకుంటే అనూహ్యంగా కుప్పకూలారు. శార్దూల్ ఠాకూర్, కరుణ్ నాయర్, జడేజా కనీస స్థాయిలో బ్యాటింగ్ చేయలేకపోయారు. భారత పరాజయానికి ఇదే ప్రధాన కారణం. సెకండ్ టెస్టులో టీమిండియాకు ఆ సమస్య లేనట్టు కనిపిస్తుంది.

# జైశ్వాల్ హాఫ్ సెంచరీ.. తొలి సెషన్‌లో రెండు వికెట్లు కోల్పోయిన టీమిండియా




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరుగుతున్న ఎడ్జ్ బాస్టన్ టెస్టులో టీమిండియా మొదటి రోజు తొలి సెషన్ లో రాణించింది. ఓపెనర్ రాహుల్ విఫలమైనా.. కరుణ్ నాయర్, జైశ్వాల్ భాగస్వామ్యంతో భారత్ తొలి ఈ సెషన్ లో కోలుకుంది. జైస్వాల్ హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. ఇంగ్లాండ్ రెండు కీలక వికెట్లు తీసి పర్వాలేదనిపించింది. దీంతో తొలి రోజు లంచ్ సమయానికి టీమిండియా 25 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. క్రీజ్ లో జైశ్వాల్ (62), కెప్టెన్ శుభమాన్ గిల్(1) ఉన్నారు. ఇంగ్లాండ్ బౌలర్లలో వోక్స్, కార్స్ తలో వికెట్ తీసుకున్నారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ ఇన్నింగ్స్ ను ఆచితూచి ఆరంభించింది. జైశ్వాల్ పరుగులు చేయడానికి ఇబ్బంది పడితే.. మరో ఎండ్ లో రాహుల్ పూర్తిగా డిఫెన్స్ కే పరిమితమయ్యాడు. మరోవైపు ఇంగ్లాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పరుగులు చేయనీయకుండా చేశారు. క్రీజ్ లో ఉన్నంత సేపు ఇబ్బంది పడిన రాహుల్ వోక్స్ చేతికి చిక్కాడు. 26 బంతుల్లో 2 పరుగులు చేసిన రాహుల్ వోక్స్ ఇన్ స్వింగ్ కు క్లీన్ బౌల్డయ్యాడు. ఈ దశలో కరుణ్, జైశ్వాల్ జట్టును ముందకు తీసుకెళ్లారు. ఇద్దరూ ఎలాంటి అనవసర షాట్స్ కు పోకుండా జాగ్రత్తగా ఆడారు. ముఖ్యంగా కరుణ్ నాయర్ ఇంగ్లాండ్ బౌలర్లపై ఎటాకింగ్ షాట్స్ ఆడుతూ ఒత్తిడిలోకి నెట్టాడు. ఈ క్రమంలో జైశ్వాల్ తన హాఫ్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. రెండో వికెట్ కు 80 పరుగులు జోడించిన తర్వాత వీరి జోడీని కార్స్ విడగొట్టాడు. 31 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కరుణ్ నాయర్.. కార్స్ బౌలింగ్ లో స్లిప్ లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. గిల్ తో కలిసి జైశ్వాల్ లంచ్ వరకు మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు.

# వారం రోజులు రెస్ట్ ఇచ్చి పక్కన పెట్టారు.. టీమిండియాపై రవిశాస్త్రి ఫైర్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు అనుకున్నట్టుగానే తుది జట్టులో స్థానం దక్కలేదు. ముందు నుంచి అనుకున్న ప్రకారం వర్క్ లోడ్ కారణంగా బుమ్రాకు రెండో రెస్ట్ లో రెస్ట్ ఇచ్చారు. బుమ్రా స్థానంలో ఫాస్ట్ బౌలర్ ఆకాష్ దీప్ కు స్థానం దక్కింది. పని భారం కారణంగా సిరీస్‌కు ముందే బుమ్రా సిరీస్?లోని ఏవైనా మూడు మ్యాచులు మాత్రమే ఆడుతాడని.. మిగిలిన రెండు మ్యాచ్ ల్లో అతడి సేవలు కోల్పోతామని గిల్ రెండో టెస్టుకు ముందు క్లారిటీ ఇచ్చాడు. మ్యాచ్ కు ముందు వరకు రెండో టెస్టులో బుమ్రా ఆడతాడా లేదా అనే విషయంలో సందిగ్ధత నెలకొంది. టాస్ తర్వాత గిల్ మాట్లాడుతూ బుమ్రాకు రెస్ట్ ఇచ్చాము అని చెప్పడంతో ఈ స్టార్ పేసర్ లేకుండానే భారత జట్టు రెండో టెస్ట్ ఆడుతుంది. బుమ్రా రెండో టెస్టులో లేకపోవడంపై టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తన అసంతృప్తి వ్యక్తం చేసాడు. రెండో టెస్టుకు బుమ్రాను తీసుకోవాల్సిందిగా చెప్పుకొచ్చాడు. "వరల్డ్ బెస్ట్ టెస్ట్ బౌలర్ కు వారం రోజులు రెస్ట్ ఇచ్చి రెండో టెస్ట్ ఆడకుండా చేశారు. బుమ్రా జట్టులో లేకపోవడం నమ్మడానికి చాలా కష్టంగా ఉంది. టీమిండియా చేసిన ఈ పని నన్ను నిరాశకు గురి చేసింది". అని శాస్త్రి అన్నాడు. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో బుమ్రా ఆడాడు. ఈ మ్యాచులో ఈ పేసర్ చెలరేగి తొలి ఇన్నింగ్స్ లో ఐదు పడగొట్టిన టీమిండియాకు ఓటమి తప్పలేదు. రెండో టెస్టులో టీమిండియా ఖచ్చితంగా గెలవాల్సిన టెస్టులో బుమ్రా ఆడతాడని ప్రచారం జరిగినా అతనికి రెస్ట్ ఇవ్వడం జరిగింది. ఐదు మ్యాచుల సిరీసులో తొలి టెస్ట్ ఆడిన బుమ్రా.. మిలిగిన నాలుగింట్లో ఏవైనా రెండు టెస్టుల మాత్రమే ఆడనున్నాడు. 5 టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా మూడో టెస్ట్ ఐకానిక్ లార్డ్స్ లో జరగనుంది. ఈ మ్యాచ్ లో బుమ్రా ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న మ్యాచ్ విషయానికి వస్తే.. తొలి రోజు లంచ్ సమయానికి టీమిండియా 25 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. క్రీజ్ లో జైశ్వాల్ (62), కెప్టెన్ శుభమాన్ గిల్(1) ఉన్నారు. ఇంగ్లాండ్ బౌలర్లలో వోక్స్, కార్స్ తలో వికెట్ తీసుకున్నారు. జైశ్వాల్ హాఫ్ సెంచరీతో రాణించగా.. కరుణ్ నాయర్ 31 పరుగులు చేసి పర్వాలేదనిపించాడు. రాహుల్ కేవలం 2 పరుగులే చేసి నిరాశపరిచాడు.



ఇనాయా సుల్తానా ప్రకాశవంతమైన పసుపు చీరలో కొత్త చిత్రాన్ని షేర్ చేసింది

# కొత్త పెళ్లి కొడుకు ఇబ్బంది పడకుండా ఇంటిపక్కనే!

ఇటీవలే అక్కినేని అఖిల్ ధాంపత్య జీవితంలో కి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. ముంబైకి చెందిన జైనబ్ రవ్జీని వివాహం చేసుకుని ఓ ఇంటి వాడయ్యాడు. వివాహం ఎంతో నిరాడంబరంగా జరిగింది. అక్కి నేని కుటుంబం తమ ఇంట్లోనే వివాహం జరిపించింది. అటుపై అఖిల్-జైనబ్ దంపతులు కొన్ని రోజుల పాటు హనీమూన్ కి వెళ్లి తిరిగొ చ్చారు. అనంతరం అఖిల్ పెద్దగా గ్యాప్ తీసుకోకుండాని సినిమా షూటింగ్ షురూ చేసినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం అఖిల్ హీరోగా లెనిన్ చిత్రం తె రకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ షూటింగ్ కూడా అన్నపూర్ణ స్టూడియో లోనే జరగడం విశేషం. అఖిల్ విదేశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత పెద్దగా మరోచోటకి ప్రయాణం చేయకుండానే సొంత స్టూడియోలోనే షూటింగ్ జరగడంతో హాజరవుతున్నాడు. ఇప్పటికే షూటింగ్ కొంత భాగం పూర్తయిన సంగతి తెలిసిందే. ఇంతలోనే పెళ్లికి ముహూర్తం పెట్టడంతో కొన్ని రోజులగా ఆ పనుల్లోనే పడిపోయాడు.దీంతో - లెనిన్ - షూటింగ్ అకిల్ ఏకుండా జరుగుతుంది.ఈ సమయంలో అఖిల్ లేని సన్నివేశాలు చిత్రీక రించారు. తాజా షెడ్యూల్ లో అఖిల్ పాల్గొనడంతో షూటింగ్ వేగం పుంజుకుంది. వీలైనంత త్వరగా ఈ షెడ్యూల్ పూర్తి చేయాలని చూస్తున్నారు. అటుపై విదేశాల్లో కొంత పార్ట్ షూట్ చేయాల్సి ఉందిట. దానికి సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే.

ఈ సినిమా అనంతరం అఖిల్ మరో భారీ ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఓ స్టార్ డైరెక్టర్ నే రంగంలోకి దించుతున్నట్లు అక్కినేని కాంపౌండ్ వర్గాల నుంచి లీకైంది. పెళ్లైన నేపథ్యంలో ఆ సెంటిమెంట్ కూడా కలిసొస్తుందని అకిల్ కాన్ఫిడెంట్ గా ముందుకెళ్తున్నట్లు కనిపిస్తుంది.



ప్రియాంక జవాల్కర్ వీకెండ్ మూడ్ క్యాజువల్ క్లిక్‌లతో నిండిపోయింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com